

2024 వెలుగు నీడలు



తొలిసగం గతుకులు

మలిసగం అతుకులు

సూళ్లూరుపేటలో జీఎన్‌టీ రోడ్డు రిపేర్లకు రూ.40 లక్షలు

సూళ్లూరుపేట పట్టణం జీఎన్‌టీ రోడ్డు నిర్వహణకు గత వైసీపీ ప్రభుత్వం నిధులివ్వలేదు. దీంతో భారీ గోతులు ఏర్పడి రోడ్డు అధ్వాన్నంగా మారింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఈ రోడ్డు మరమ్మతులకు రూ. 40 లక్షలు మంజూరు చేసింది. త్వరలోనే పనులు మొదలు కానున్నాయి.

అధికారంలో ఉన్న ఏ పార్టీకి అయినా కనీసం ఎన్నికలకు ముందైనా ప్రజలంటే కాస్త భయం ఉంటుంది. పట్టించుకుంటున్నాం.. అని చెప్పుకోవడానికైనా కొన్ని పనులు చేస్తారు. ప్రజల తీవ్ర అవస్థలు గుర్తించి.. కాస్తయినా సరిదిద్దేందుకు పూనుకుంటారు. తను పట్టిన కుందేటికి కాళ్లే అవసరం లేదని నమ్మే నాయకులు తప్ప ఇంత మొండిగా ఉండరు. అందుకు ఫలితం ఎలా ఉంటుందో 2024 చాచికొట్టి మరీ ప్రకటించింది. జగన్ ప్రభుత్వం అయిదేళ్ల గతుకుల పాలన 2024 తొలిసగంలోనూ యథాతథంగా కొనసాగింది. అందుకు నిలువెత్తు సాక్ష్యం జిల్లాలోని రోడ్లు. చారెడు మట్టి వేయలేదు. కొత్తవి నిర్మించలేదు. వానలు వరదలొచ్చి దెబ్బతిన్నా పట్టించుకోలేదు. అందుకే.. అధికారంలోకి వచ్చీరాగానే కూటమి ప్రభుత్వం రోడ్ల బాగుకు పూనుకున్నది. ముందుగా అతుకులు వేసి గతుకులు పూడ్చే పని మొదలైంది. జిల్లా రోడ్ల తీరుతెన్నుల వెలుగునీడల సమాహారం....

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

విలక్షణమైన కాలానికి సాక్ష్యం 2024 సంవత్సరం. విభజనతో కునారిల్లుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండు భిన్న దృక్పథాలుగల ప్రభుత్వాలను చూసింది. ఈ ఏడాది మే 13న సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. జూన్ 4న ఫలితాలు ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వం ఘోర పరాజయాన్ని చవిచూసింది. కూటమి ప్రభుత్వం 12న బాధ్యతలు స్వీకరించింది. విధ్వంసమే పాలనగా సాగిన కాలానికి రోజులు చెల్లాయి. ఇటుక ఇటుకా పేర్చి పునర్నిర్మాణం మొదలైంది. అయిదున్నర నెలల జగన్ పాలనకూ, చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఆరున్నర నెలల పాలనకూ ఉన్న తేడాలను జిల్లా ప్రజలు చూస్తున్నారు. ఆ తేడాలను వెల్లడించే సచిత్ర వరుస కథనాల్లో మొదటిది ఇది.

గతుకులు మిగిల్చిన జగన్

తొలిసగం: జిల్లావ్యాప్తంగా ప్రధాన రహదారులు, గ్రామీణ రహదారులు అనే తేడా లేకుండా అన్నీ అధ్వాన్నంగా మారాయి. అడుగడుగునా గోతులతో ప్రధాన రహదారులు వాహనదారుల సహనానికి పరీక్ష పెట్టాయి. కిలోమీటర్ల కొద్దీ తారులేచిపోయి, కంకర బయటపడి తరచూ వాహనదారులను ప్రమాదాలకు గురి చేశాయి. గ్రామీణ రహదారులైతే చాలావరకూ రూపు కోల్పోయాయి. అడపాదడపా సంభవించిన తుపాన్లు రహదారులను మరింతగా దెబ్బతీశాయి. నయాపైసా నిధులు విదిలించలేదు. వైసీపీ నాయకులకే రోడ్లు తలనొప్పి వ్యవహారంగా మారాయి. సార్వత్రిక ఎన్నికల వరకూ కూడా జిల్లాలోని రోడ్ల గురించి పట్టించుకున్నవారే లేరు.

అతుకులేస్తున్న కూటమి

మలిసగం: అప్పుల కుప్పగా మారిన ఆంధ్రప్రదేశ్ పాలనా బాధ్యతలు స్వీకరించిన కూటమి ప్రభుత్వం తొలి చూపు రోడ్లమీదే పడింది. ఆర్థిక సంక్షోభం కారణంగా పూర్తిస్థాయిలో రోడ్ల పునర్నిర్మాణానికి వీలులేకపోయినా వాహనదారులకు తక్షణ ఉపశమనంగా గోతులు పూడ్చి మరమ్మతులు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం జిల్లాకు తక్షణం రూ. 80 కోట్లు మంజూరు చేసింది. 1208 పనులు గుర్తించింది. యుద్ధప్రాతిపదికన 1051 పనులు పూర్తయ్యాయి. మరో 157 పనులు పురోగతిలో వున్నాయి.



ఇప్పుడు..

రోడ్డు మరమ్మతులు జరిగాక..



అప్పుడు..

గూడూరు పట్టణ శివార్లలోని చెన్నూరు వద్ద ఎన్నికల ముందు వరకిలా..



ఇప్పుడు..

కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో తాజాగా మరమ్మతులు చేపట్టాక బంగారుపేట వద్ద రోడ్డు ఇలా..



అప్పుడు..

వైసీపీ ప్రభుత్వం నిధులివ్వక వెంకటగిరి శివారు బంగారుపేట వద్ద ఆర్‌అండ్ బీ రోడ్డు దుస్థితి





తడ మండలం రామాపురంలో మూడు రోజుల కిందటి వరకూ వున్న మట్టి రోడ్డు.. పల్లె పండుగ తో సిమెంటు రోడ్డుగా మారిందిలా..

వంద కోట్లతో పల్లె రోడ్లకు పండుగ

దారుణంగా వున్న గ్రామీణ రోడ్లపైనా దృష్టి పెట్టారు. పల్లె పండుగ పేరిట సీసీ రోడ్లు, తారు రోడ్లు, మెటల్ రోడ్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు.మొత్తం 1604 రోడ్ల నిర్మాణానికి రూ. 100.15 కోట్లు మంజూరు చేశారు.



కొత్తగుంట-కోగిలి రోడ్డు మరమ్మతులకు రూ. 10 లక్షలు

చిట్టమూరు మండలం ఉడతావారిపాలెం నుంచీ శ్రీహరికోట రోడ్డు వరకూ వున్న లింకు రోడ్డు పరిస్థితి దారుణంగా వుంది. గత ప్రభుత్వం నిర్వహణ గురించి పట్టించుకోలేదు. తాజాగా ప్రభుత్వం ఈ రోడ్డు మరమ్మతుల కోసం రూ. 10 లక్షలు మంజూరు చేసింది.



అప్పుడు..

జూలై నాటికి పాకాల మండలం ఊట్లవారి పల్లి వద్ద రోడ్డు దుస్థితి



ఇప్పుడు..

మరమ్మతులు జరిగాక చక్కగా కనిపిస్తున్న రోడ్డు



ఇప్పుడు..

బాగుపడిందిలా..



అప్పుడు..

కోట మండలం గూడలి వద్ద గోతులతో దెబ్బ తిన్న రోడ్డు



అప్పుడు..

శ్రీకాళహస్తిలో ఏపీ సీడ్స్ కూడలి వద్ద గోతులతో దెబ్బతిన్న రోడ్డు



ఇప్పుడు..

చక్కగా మారిందిలా..

నరకయాతన

- పుట్టినప్పటి నుంచీ అంతుపట్టని వ్యాధితో సతమతం
- ఆదుకోవాలంటూ రెవెన్యూ సదస్సులో చిన్నారుల వేడుకోలు

మాడిపోయినట్లుండే శరీరం. వాతావరణ పరిస్థితులతో చర్మం పగుళ్లిస్తుంది. రక్తం కారుతుంది. తట్టుకోలేని మంటలతో ఆ ఇద్దరు చిన్నారులు నరకయాతన అనుభవిస్తున్నారు. వీరిని చూసి తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. వీరి ఆరోగ్య బాగుకు దాతలు సహకరించాలని కోరుతున్నారు.

- కోట, ఆంధ్రజ్యోతి

కోట మండలం కర్లపూడి బీసీ కాలనీలోని ఊడత వెంకటసుబ్బయ్యకు ముగ్గురు పిల్లలు. మొదటి ఆడబిడ్డ ఆరోగ్యంగా ఉంది. ఆ తర్వాత జన్మించిన ఇద్దరు కుమారులు.. నాగరాజు, హర్షకు చిన్నప్పటి నుంచీ శరీరం, ముఖం, నల్లగా మాడిపోయి దద్దులుగా ఉన్నాయి. చర్మంపై చెమట పట్టకుండా తడి ఆరిపోయి పట్టలు పట్టలుగా పగిలిపోతూ ఉంటుంది. ఆ క్రమంలో రక్తం, నీరు కారుతూ ఉంటాయి. రాత్రి వేళ నిద్రపోలేని పరిస్థితి. వర్షాకాలం ఒకలా.. ఎండలోకి వెళ్లితే మరోలా వీరిద్దరి చర్మం మరింతగా బిగుసుకుపోయి పగిలిపోతుంది. తమ పిల్లల నరకయాతనను చూడలేక తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారు. అప్పులు చేసి వీరిని చెన్నైలోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. జన్యులోపం ఉండొచ్చని.. పదేళ్ల తర్వాత చర్మం సర్జరీ చేస్తామని వైద్యులు చెప్పినట్లు వీరి తండ్రి వెంకటసుబ్బయ్య తెలిపారు. నిరుపేదలైన ఇక్కడికే వైద్యం చేయించలేక ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. దాతలు సాయం అందించాలని కోరుతున్నారు. ప్రస్తుతం కర్లపూడి ప్రభుత్వ పాఠశాలలో నాగరాజు 5వ తరగతి, హర్ష ఒకటో తరగతి చదువుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం కర్లపూడిలో జరిగిన రెవెన్యూ సదస్సుకు నాగరాజు, హర్ష చేరుకొని తమకు ప్రాణబిక్ష పెట్టాలని తహసీల్దారు జయజయరావును కోరారు. ఆయన రూ.5వేలు వితరణగా ఇచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వపరంగా ఆదుకునేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



నాగరాజు, హర్ష

ఇసుక అక్రమ రవాణాను ఉపేక్షించం

- త్వరలో మూడు కేంద్రాల నుంచి పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితిలోనూ ఉపేక్షించేది లేదని కలెక్టర్ వెంకటేశ్వర్ స్పష్టంచేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి మొదటి వారంలో జిల్లాలో మూడు డిసిల్టేషన్ పాయింట్ల నుంచి ఇసుక ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. 1,37,686మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. స్వర్ణముఖి నదీ తీరప్రాంతమైన పెళ్లకూరు మండలం పుల్లూరు గ్రామం, దిగువకలువకూరు, కోట మండలం గుడాలిగ్రామంలో ఇసుక అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు. ఇసుక తవ్వడానికి, రవాణాకు ఏజెన్సీకి అప్పగించామన్నారు. ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకున్నా లేదా నేరుగా వెళ్లి నామమాత్రపు రుసుం చెల్లించి ఈ స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక పొందవచ్చన్నారు. ఇసుక ధర, రవాణా తదితర సమాచారం అన్ని సచివాలయాల్లో, తహసీల్దారు, ఎంపీడీవో, పోలీసు కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. సరిహద్దు ప్రాంతమైన తడ, గాదంకి, సురుటుపల్లి చెక్‌పోస్టుల వద్ద పోలీసు, రెవెన్యూ నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్పీ సుబ్బరాయుడు, అధికారులు భానుప్రకాష్ రెడ్డి, బాలాజీనాయక్, శ్రీనివాసరావు, మురళీ మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

43 గ్రామ సభలకు 648 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం 43 గ్రామసభలు జరగగా 648 అర్జీలు అందాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. వీటిలో 68 అర్జీలను అప్పటికప్పుడే పరిష్కరించగా, మిగిలిన వాటిని కాలపరిమితిలోపు అధికారులు పరిష్కరిస్తారన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ తేదీలు మారాయ్!

తిరుపతి(కలెక్టరేట్)/దొరవారిసత్రం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వేదికగా నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్ తేదీలు మారినట్లు తెలిసింది. తొలుత జనవరి 10 నుంచి మూడు రోజుల పాటు జరగాల్సి ఉండేది. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రావడం, శ్రీవారి దర్శనానికి వీవీఐపీల తాకిడి ఎక్కువగా ఉండటంతో ఫ్లెమింగో ఫెస్టివల్ (పక్షుల పండుగ)ను సంక్రాంతి తర్వాత నిర్వహించాలని యంత్రాంగం భావించింది. ఆ ప్రకారం జనవరి 17 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించడానికి కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్ణయం తీసుకున్నారు. గత షెడ్యూల్‌లో ఏవిధంగా కార్యక్రమాలు, వేదికలు ఉన్నాయో అదే విధంగా అంగరంగ వైభవంగా నిర్వహించడానికి కలెక్టర్ నేతృత్వంలో కమిటీ సంసిద్ధమైంది.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

- మరో రెండు రోజుల పాటు వర్ష సూచన
- తీరం వెంబడి చలి గాలుల తీవ్రత అధికం

సూళ్లూరుపేట/కోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లాకు భారీ వర్షాల ముప్పు పొంచి ఉంది. మంగళవారం తెల్లవారుజామున సూళ్లూరుపేటలో చలి గాలులతో కూడిన తేలికపాటి జల్లులు పడ్డాయి. ఇది బలపడితే ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు మరో రెండు రోజుల పాటు కురుస్తాయని వాతావరణశాఖ పేర్కొంది. ప్రస్తుతం తీరానికి సమీపంలో కదులుతున్న క్రమంలో మేఘాలు కమ్ముకుని, చలిగాలులు వీస్తున్నాయి. సముద్రంలో గంటకు 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తుండటంతో అల్లకల్లోలంగా ఉంటుందని మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించారు. కాగా, కోట మండలం గోవిందపల్లిపాలెం, శ్రీనివాస సత్రం గ్రామాల సమీపంలో మంగళవారం సముద్రం కల్లోల భరితంగా మారింది. దీంతో మత్స్యకారులు చేపలవేట నిలిపివేశారు.



విద్యుద్దీపాల వెలుగులో తిరుపతి వెస్ట్ చర్చి



ప్రార్థనల సందర్భంగా పాస్టర్ ఆశీర్వాదం



క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు

క్రిస్మస్‌కోసం జిల్లాలో చర్చిలు ముస్తాబయ్యాయి. ఏసుక్రీస్తు జననానికి సంబంధించి గొర్రెలపాక, బొమ్మలు, లైట్ స్టార్లు, క్రిస్మస్ ట్రీ, క్రైస్తవుల ఇళ్లు, చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో మంగళవారం సాయంత్రానికి ప్రత్యేకంగా అలంకరించారు. అర్ధరాత్రి దాటాక క్రైస్తవ కుటుంబ సభ్యులు కేక్‌లను కట్‌చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాగా, జిల్లాలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో కిస్మస్ జరుపుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపారు.

- తిరుపతి (కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి





క్రీస్తు జననం ఘట్టాల నమూనా

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి సాధ్యం

● నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్


సదాశివాన్ని సత్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నేతలు

చంద్రగిరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఏపీ నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం చెప్పారు. మంగళవారం చంద్రగిరిలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఆయన స్థానిక నాయి బ్రాహ్మణులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీల కోసం బడ్జెట్లో రూ.39 వేల కోట్లు కేటాయించారన్నారు. దేవాలయాల్లో నాయీ బ్రాహ్మణులకు రూ.15 వేల వేతనాన్ని రూ.25వేలకు పెంచారన్నారు పాలకమండలిలో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పిస్తామన్నారన్నారు. బీసీ రక్షణ చట్టాన్ని మరింత పగడ్బందీగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. బీసీ విద్యార్థుల కోసం జిల్లా కేంద్రాల్లో డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారని చెప్పారు. కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు ఎం జయచంద్ర, సీఎం లోకనాథం, ఆవులపాటి ప్రభాకర్ ఎం మనీ, ప్రభాకర్, సుధాకర్, బలరామయ్య, త్యాగరాజు, రేవంత్, పురుషోత్తం, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో స్థానికుల సమస్యలను పరిష్కరించండి


టీటీడీ చైర్మన్‌తో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తిరుమల, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమల స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం రాత్రి టీడీపీ నాయకులు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుని కోరారు. కొనేళ్లుగా వివిధ రకాల సమస్యలతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారని, వాటిని పరిష్కరించాలని టీడీపీ నాయకులు సుగుణమ్మ, నరసింహయాదవ్, శ్రీధర్‌వర్మ, ఆర్సీ మునికృష్ణ టీటీడీ బోర్డు సభ్యులు పనబాక లక్ష్మీ, భానుప్రకాష్‌రెడ్డితో కలిసి చైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. బీఆర్ నాయుడు స్పందిస్తూ స్థానికుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సీఎం ఆదేశాలతో వచ్చే ఆదివారం అర్జీలు స్వీకరిస్తామన్నారు. తిరుమల నాయకులు రామూర్తిరాయల్, రాజుయాదవ్, శివషణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన పోలీస్ స్టేషన్ ల్యాండ్ ఫోన్

చంద్రగిరి, డిసెబరు 24(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ల్యాండ్ ఫోన్ మూడు నెలలుగా పనిచేయడంలేదు. దీంతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్ స్టేషన్‌లో 0877-2289020 నంబరుతో ఫోన్ ఉంది. ల్యాండ్ ఫోన్ పనిచేయకపోవడంతో స్టేషన్‌లో సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నా, పోలీసులు బాధితులకు సమాచారం తెలపాలన్నా సొంత సెల్ ఫోన్‌ల నుంచే కాల్స్ చేస్తున్నారు. విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లినా, బాధితులు అర్ధరాత్రి వేళల్లో కూడా ఫోన్ కాల్ చేస్తున్నారని స్టేషన్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలకు పైగా ఫోన్ బిల్లు చెల్లించనందుక కనెక్షన్ తొలగించినట్లు సమాచారం. సంబంధిత అధికారులు స్పందించి ల్యాండ్ ఫోన్ పనిచేసేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

పెద్దరామాపురం రెవెన్యూ సదస్సుకు 45 అర్జీలు



పాకాల, డిసెంబరు 24: (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దరామాపురం పంచాయతీ చిగరపల్లెలో మంగళవారం తహసీల్దార్ నిత్యానందబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇంటిపట్టాలు, మ్యూటేషన్, భూముల ఆన్‌లైన్, రేషన్ కార్డుల కోసం ప్రజలు 45 అర్జీలు అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఏడి అరుణ్‌కుమార్, డిప్యూ చంద్రబాబు, టీడీపీ నాయకులు ఎ.బాలాజీనాయుడు, ఎ.బుల్లినాయుడు, ఎ.మోహనకృష్ణ, శ్రీనివాసులు, వాసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

రోడ్డు నిర్మాణానికి రూ.2.55 కోట్లు మంజూరు

రామచంద్రాపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకండ్రిగ నుంచి కొత్త నెన్నూరు వరకు గుండోడు కనుమ రోడ్డు నిర్మాణానికి నరేగా నుంచి రూ.2.55కోట్లు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. మంగళవారం తాటిమాకుల కండ్రిగ వద్ద గ్రామస్థులతో కలిసి ఆయన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు గుండోడు-కనం రోడ్డు నిర్మాణ పనులు త్వరలో చేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా కలిసికట్టుగా గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. నిధులు మంజూరు చేయించినందుకు తాటిమాకుల గ్రామస్థులు నానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ కేశవులునాయుడు, నాయకులు జనార్దనచౌదరి, కోరా హరిప్రసాద్, సురేందర్‌నాయుడు, ధనంజయులు, చిరంజీవి, రవికుమార్, హరి, రామిరెడ్డి, కోటేశ్వరరెడ్డి, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు



చంద్రగిరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రిస్మస్ శాంటక్లాజ్ క్యాప్ ధరించి ఆకట్టుకున్నారు. పాఠశాల కరెస్పాండెంట్ బి.హితేంద్రనాథ్‌రెడ్డి వేడుక విశేషాలను వివరించారు.

ఘనంగా ముగిసిన జోనల్ క్రీడా పోటీలు



క్రీడాకారులకు మెమెంటోలను అందజేస్తున్న ఎమ్మెల్యే నాని,శాప్ చైర్మన్ రవినాయుడు తదితరులు

చంద్రగిరి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం సమీపంలోని నారాయణ కళాశాలలో జోనల్ క్రీడా పోటీలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పులివర్తి నాని, శాప్ చైర్మన్ రవినాయుడు, ఇండియన్ హాకీ గోల్ కీపర్ రజిని, నారాయణ కళాశాల డీజీఎం కొండలరావులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులకు విద్యతోపాటు క్రీడా పోటీలలో రాణించేందుకు అవసరమైన ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ విద్యార్థులలో క్రీడలను ప్రోత్సహించడానికి మంత్రి నారా లోకేష్ ప్రతి పాఠశాలలో తప్పనిసరి చేస్తూ జీవో విడుదల చేశారన్నారు. ఇండియన హాకీ గోల్ కీపర్ రజిని మాట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుత ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చిందన్నారు. క్రీడాకారులకు మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రవికాంత్‌గుప్తా, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నాయకుడి జన్మదిన వేడుక


శ్రీధర్‌నాయుడితో కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే నానీ

చంద్రగిరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు వైకుంఠం శ్రీధర్‌నాయుడు జన్మదినాన్ని ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శాలువాతో సత్కరించి కేక్ తినిపించారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, చేకూరు జనార్ధన్‌చౌదరి, చెరుకూరి మధుశేఖర్, కె.రమేష్‌నాయుడు, శరవణ, భాస్కర్‌రెడ్డి, పేరూరు శ్రీనివాసులు, కత్తి సుధాకర్, విప్పర్ల లోకేష్, కిషోర్‌రెడ్డి, చంద్రగిరి మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

మురుగుమయంగా కొత్తపాళెం లేఅవుట్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పంచాయతీ పరిధిలోని కొత్తపాళెం లేఅవుట్‌లో మురుగునీటి కాలువ ద్వారా వెళ్లే మురుగునీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. ఆ ప్రాంతం చెరువును తలపించేలా మారింది. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని విశ్రాంత తహసీల్దారు జయచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. కొత్తపాళెం లేఅవుట్ పూర్తిగా మురుగునీటితో నిండి దోమలు, పాములకు ఆవాసంగా మారిందని విచారం వ్యక్తం చేశారు. స్థానికులు జ్వరాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

భక్తురాలికి బ్యాగు అప్పగింత


లలితమ్మకు బ్యాగు అప్పగిస్తున్న అదనపు ఏవీఐ బ్రహ్మానందరాజు

తిరుచానూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనానికి వచ్చిన ఓ మహిళకు పోగొట్టుకున్న హ్యాండ్‌బ్యాగ్ ఆలయ అధికారులు భద్రంగా అప్పగించారు. అనంతపురానికి చెందిన లలితమ్మ కుటుంబసభ్యులు మంగళవారం అమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆలయ హుండీ వద్ద ఆమె తన హ్యాండ్‌బ్యాగ్ పోగొట్టుకుంది. తోటి భక్తులు గుర్తించి బ్యాగును ఆలయ అధికారులకు అందజేశారు. బ్యాగ్ పోయిన విషయాన్ని లలితమ్మ అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. వివరాలు సరిపోలడంతో బాధితురాలికి ఆలయ ఏవీఐ బ్రహ్మానందరాజు హ్యాండ్ బ్యాగ్‌ను అందజేశారు. అందులో రూ.11,400 నగదు ఉంది.

వీఐపీల బస ప్రాంతంలో శునకాలు


పద్మావతి అతిథి గృహాల వద్ద శునకం

తిరుమల, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమలలో రోజురోజుకూ వీధికుక్కలు పెరిగిపోతున్నాయి. సాధారణంగా తిరుమలలో శునకాల సంచారం నిషేదం. ఒకవేళ ప్రవేశిస్తే హెల్త్ విభాగం గుర్తించి వాటిని తిరుపతికి తరలించాలి. సిబ్బంది నిర్లక్ష్యంగా కొండపై కుక్కల సంచారం పెరిగిపోతోంది. ఈమధ్య హోటళ్లు, కాటేజీలు, స్థానికులు నివసించే బాలాజీనగర్‌లో అధికంగా కనిపిస్తున్న శునకాలు ఇప్పుడు ఏకంగా వీఐపీలు బస చేసే పద్మావతి ఏరియాలోని అతిథిగృహాల వద్ద తిరుగుతున్నాయి. భక్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి,(విద్య), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూళ్లలో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు పోటీ పరీక్షల సమాచార కేంద్ర డైరెక్టర్ డాక్టర్ ఎన్.విశ్వనాథ్ రెడ్డి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి 6,9 తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న పరీక్షకు జనవరి 13వ తేది లోపల దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2013 ఏప్రిల్ 1 నుంచి 2015 మార్చి 31లోపు జన్మించిన బాలబాలికలు 6వ తరగతి ప్రవేశానికి, 2010 ఏప్రిల్ 1 నుంచి 2012 మార్చి 31 మధ్య జన్మించిన విద్యార్థులు 9వ తరగతిలో చేరేందుకు అర్హులన్నారు. స్థానిక వరదరాజ నగర్‌లోని విశ్వం పాఠశాలలోని ఉచిత పోటీ పరీక్షల సమాచార కేంద్రం నుంచి దరఖాస్తులు సమర్పించవచ్చునన్నారు. ప్రవేశ పరీక్ష విధానం, దరఖాస్తుల సమాచారం, నమూనా పరీక్షల వివరాలను సమాచార కేంద్రం నుంచి పొందవచ్చునని వెల్లడించారు. వివరాల కోసం 8688888802, 8688888803, 9399976999 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చునన్నారు.

కుట్రదారులపై చర్యలు తీసుకోవాలి: సీఐటీయూ

తిరుపతి(ఆటోనగర్)డిసెంబరు24(ఆంధ్రజ్యోతి):తిరుపతిలో మతవిద్వేషాలను రెచ్చగొట్టడానికి కుట్రలు పన్నుతున్న విద్రోహ శక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే అన్నమయ్య విగ్రహంపై టోపీపెట్టారన్నారు. సీసీకెమెరాల ద్వారా పరిశీలించి కుట్రదారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

యువతి ఆత్మహత్య

రేణిగుంట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో యువతి ఉరి వేసుకుంది. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వీఎం వీధికి చెందిన సతీష్‌కుమార్ కుమార్తె అనిత(22) ఇటీవల లండన్‌లో ఎంఎస్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చింది. విదేశాల్లో మరిన్ని ఉన్నత చదువులు చదవాలని తండ్రితో చెప్పింది. ఏమైందో తెలియదు కానీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుంది. కుటుంబీకుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

పరశురామేశ్వరుడికి వితరణ

ఏర్పేడు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరాలయంలో నిత్యాన్నదానం నిర్వహణకు తిరుపతికి చెందిన సునీల్‌కుమార్, సృజన దంపతులు ఐదు లీటర్ల హాట్ బాక్సులు, 50 ప్లాస్టిక్ ప్లేట్లను అందించగా, రవి 50 లీటర్ల స్టీల్ వాటర్ డ్రమ్మును వితరణ చేశారు. అదే విధంగా తిరుపతికి చెందిన నాగరాజు ఫ్యాన్‌ను అందజేశారు. వీటిని ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు ఆధ్వర్యంలో ఆలయ అధికారులకు అందించారు. వారికి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

వైసీపీ నేతల 'గుట్ట'కాయస్వాహా..

● చదును చేసి మరీ ఆక్రమణ
● పట్టించుకోని అధికారులు


గంగుడుపల్లె సమీపంలో గుట్టలను చదును చేశారిలా..

చంద్రగిరి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): గంగుడుపల్లె సమీపంలోని గుట్టలను స్థానిక వైసీపీ నాయకులు దర్జాగా కబ్జా చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో యంత్రాలతో చదును చేస్తున్నా అటవీ, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చంద్రగిరి మండలం, రామచంద్రాపురం మండలం, సరిహద్దుల్లో గంగుడుపల్లె సచివాలయం భవనానికి తూర్పు భాగంలో అటవీ ప్రాంతం ఉంది. ఇక్కడ గంగుడుపల్లెకు చెందిన వైసీపీ నాయకులు ప్రభుత్వ గుట్టలో సుమారు 30 ఎకరాల గుట్టను చదును చేసి దర్జాగా మామిడి చెట్లు నాటారు. అక్కడితో ఆగకుండా గుట్ట మొత్తం చదును చేస్తున్నారు. దీనిపై స్థానికులు రెవెన్యూ, అటవీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. గుట్ట ప్రాంతంలోని భూమిలో గంగుడుపల్లె, బొప్పరాజుపల్లె పశువులను మేతకు తీసుకువెళ్లేవారమని వారు చెబుతున్నారు. గుట్టను చదును చేసి, చెట్లు పెట్టి, ఫెన్సింగ్ కూడా వేయడం దారుణమంటున్నారు. రెవెన్యూ అటవీ అధికారులు స్పందించి భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని గంగుడుపల్లె, బొప్పరాజుపల్లె గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడుతాం: ఎమ్మెల్యే నాని


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

రామచంద్రాపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద ప్రజల భూములను పరిరక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసిందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మంగళవారం మండలంలోని కుప్పంబాదూరు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పేదల భూములను ఆ పార్టీ నాయకులు రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి కబ్జాకు పాల్పడ్డారన్నారు. వాటిపై రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేస్తే అధికారులు వెంటనే పరిష్కరించి న్యాయం చేస్తారన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం ప్రజల నుంచి ఎమ్మెల్యే ఫిర్యాదులను స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ సమస్యలపై 60 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు వెంటకరమణ తెలిపారు. ఎంపీడీవో ఇందిర, మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, కేశవులునాయుడు, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

చర్చిలకు క్రిస్మస్ కాంతులు


విద్యుద్దీప కాంతులతో పాకాల సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చి


చంద్రగిరిలో ముస్తాబయిన ఆంధ్రా సెయింట్ లూక్ చర్చి

పాకాల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. డిసెంబరు 1న ప్రారంభమైన వేడుకల్లో భాగంగా క్యారల్ సర్వీసులు, ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. బుధవారం క్రిస్మస్ ఆరాధన కోసం రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చ్, రైల్వే స్టేషన్ ఎదుటవున్న సీఎస్ఐ టౌన్ చర్చ్, సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చ్‌లను ప్రత్యేక పుష్పాలు, విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు. భారీ స్టార్‌లు ఏర్పాటు చేసి యేసు జననాన్ని గుర్తుచేస్తూ పశువులపాక ఏర్పాటు చేశారు. మంగళవారం సాయంత్రం సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ ఈవ్ ప్రార్థనలు, అర్ధరాత్రి కమ్యూనియన్ సర్వీసు నిర్వహించారు. బుధవారం ఉదయం ఆయా చర్చిలలో ప్రత్యేక ఆరాధనకు ఏర్పాట్లు చేశారు. **చంద్రగిరి:** పట్టణంలోని చర్చివీధిలోని ఆంధ్రా సెయింట్ లూక్, భారతీనగర్, బీడీ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, రెడ్డివారిపల్లెలోని చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. క్రిస్మస్ ట్రీని ఏర్పాటు చేశారు. ప్రార్థనలు చేశారు.

రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న అఖిలపక్ష నేతలు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని అఖిలపక్ష నేతలు కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మంగళవారం అఖిలపక్ష నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల కిందట ప్రారంభించిన హంద్రీ-నీవా, గాలేరు నగరి, వెలుగొండ, శ్రీశైలం కుడికాలువ, సోమశిల హైలెవల్ ఎత్తిపోతల పథకం, తెలుగుగంగ ప్రాజెక్టులు వంటివి ఇంకా పెండింగ్‌లో ఉండటం శోచనీయమన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తి చేస్తే రాయలసీమ ప్రాంతంలో 24 లక్షల ఎకరాలకు సాగునీరు, వేలాది గ్రామాలకు తాగునీరు అందుబాటులోకి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టులను పూర్తిచేసే దిశగా చర్యలు చేపట్టాలని లేకపోతే రాయలసీమ ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించాల్సి వస్తుందన్నారు. అలాగే విభజనచట్టంలో పేర్కొన్న విధంగా వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీని ఎన్డీఏ ప్రభుత్వం ఆపివేయడం బాధాకరమన్నారు. వెంటనే విభజన హామీలను పరిశీలించి అమలు చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పీసీ ఎన్‌డీటీ సమావేశం జరిగింది. ఎస్పీ సుబ్బరాయుడుతో కలిసి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, పోలీసు అధికారులు, ఎన్జీవో కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయ రాదన్నారు. ఆడపిల్లలపై చిన్నచూపు పోవాలన్నారు. స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, డీఎస్పీ శ్రీలత, ఇమ్యునైజేషన్ అధికారి శాంతకుమారి, డాక్టర్ శ్రీనివాసులు, డెమో, విన్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మీరా తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు కళ్లెం : జిల్లా ఎస్పీ


సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సైబర్ నేరాలు...దొంగతనాల అడ్డుకట్టకు ప్రజల సహకారం అవసరమని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. తిరుపతిలోని ఒక ప్రయివేటు కళ్యాణమండపంలో మంగళవారం దుకాణ, వాణిజ్య, వర్తక సముదాయాలు, వ్యాపారస్తులు, పోలీసులు మధ్య అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సంధర్బంగా ఎస్పీ మాట్లాడుతూ వాణిజ్య సముదాయాలున్న ప్రతి చోటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం బాధ్యతగా గుర్తించాలన్నారు. వీటితో సులభంగా నేరస్థులను గుర్తు పట్టవచ్చన్నారు. సమాజానికి భద్రత కూడా ఉంటుందన్నారు. తిరుపతి ప్రతిష్టను దృష్టిలో వుంచుకుని క్రక్ష్య వ్యాపార సముదాయాలు, ఆసుపత్రులు, అపార్టుమెంట్లు, దుకాణాలు, తదితర ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డీఎస్పీ వెంకటనారాయణ, సీఐలు రామకృష్ణ, రాంకిషోర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్ రాజు, సెక్రటరీ వాసుదేవన్, కోశాధికారి అయ్యప్ప, ఆర్‌ఎస్ రామిరెడ్డి, వస్త్ర వ్యాపారులు సంఘం, వివిధ వాణిజ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా మనోన్మణి ఉత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం మనోన్మణి (గొబ్బెమ్మ) ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో గొబ్బెమ్మకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారిని చప్పరంపై అధిష్టింపజేసి వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

రేషన్ బియ్యం స్వాధీనం



సత్యవేడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేశారు. శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్ద ఈటిపాకం సమీపంలో మంగళవారం తెల్లవారు జామున ఎస్ఐ హరిప్రసాద్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. అటుగా వచ్చిన మినీవ్యాన్‌ను ఆపి రికార్డులు పరిశీలించారు. ఇందులో 77 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో వ్యాన్‌లో ఉన్న ఒకరిని అదుపులో తీసుకోగా, డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు పరారయ్యారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ టీచర్లకు ముగిసిన పదోన్నతి కౌన్సెలింగ్

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలోని టీచర్లకు సీనియారిటీ ఆధారంగా చేపట్టిన పదోన్నతి కౌన్సెలింగ్ మంగళవారంతో ప్రశాంతంగా ముగిసింది. డీఈవో వరలక్ష్మి ఆధ్వర్యంలో అర్హత కలిగిన టీచర్లకు పదోన్నతి కల్పించారు. ఆదివారం ఎస్ఏ నుంచి హెచ్‌ఎం పదోన్నతి ప్రక్రియ ముగియగా, సోమవారం ఎస్జీటీ నుంచి ఎస్ఏలకు పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. సంబంధిత సెక్షన్ అధికారుల సమన్వయలోపంతో సీనియారిటీ జాబితా తయారీ సవరణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో సోమవారం నిర్వహించాల్సిన పదోన్నతి కౌన్సెలింగ్ పక్రియను మంగళవారం మధ్యాహ్నానికి వాయిదా వేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు.డీఈవో జోక్యంతో మంగళవారం ఉదయం నుంచి సీనియారిటీపై కసరత్తు చేసి, ఆపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్జీటీలకు ఎస్ఏలుగా 36 పోస్టులకు గాను హిందీ, తెలుగు మినహా 27పోస్టులకు పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహించారు. మున్సిపాలిటీ ఫిజిక్స్, మ్యాథ్స్, కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో ఇంగ్లీషు నాలుగు, బయాలజీ 8 (తెలుగు), సోషియల్ (తెలుగు) 10, మ్యాథ్స్ (తెలుగు), ఫిజిక్స్ (తెలుగు), సోషియల్ (తమిళం), పీడీ (తెలుగు) ఒక్కో పోస్టు ఉన్నాయి.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


పిచ్చి మొక్కలు తొలగించాక ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇలా..

తిరుపతి(కపిలతీర్థం), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కపిలతీర్థం రోడ్డులోని రామచంద్రనగర్ వద్ద విద్యుత్ 'ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు' అనే శీర్షికతో శనివారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సోమవారం పిచ్చిమొక్కలను తొలగించారు. స్థానికులు దీనిపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైనేజీ పైపులో పూడిక తొలగింపు

తిరుపతి అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డులోని బడిషైన్ షాపు వద్ద డ్రైనేజీ పైపులో పూడికను సోమవారం తొలగించారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'పైపులుపూడి మురుగునీటి దుర్గంధం' అన్న శీర్షిక కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక సంస్థ పారిశుద్య విభాగ సిబ్బంది పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. దీంతో మురుగునీరు సక్రమంగా ప్రవహిస్తోంది.

సెలవుల రద్దీని సద్వినియోగం చేసుకుందాం



అధికారులతో సమీక్షిస్తున్న ప్రజారవాణాధికారి జగదీష్

తిరుపతి (ఆర్టీసీ), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సెలవుల రద్దీని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ డీపీటీవో జగదీష్ సూచించారు. మంగళవారం తన ఛాంబర్ అధికారులతో చర్చించారు. తిరుపతికి వచ్చే రైళ్ల సమయానికి అనుగుణంగా సరిపడా బస్సులు నడపాలని సూచిం చారు. పూర్తిగా నిండిన బస్సులను మాత్రమే ఫ్లైఓవర్‌పై నడపాలని, మిగిలిన వాటిని కిందనే నడిపి మార్గమధ్యంలో ప్రయాణికులను ఎక్కించుకోవాలని తెలియజేశారు. వైకుంఠ ఏకాదశికి తిరుమలతో పాటు, జిల్లాలోని పలు వైష్ణవాలయాలకు ఉన్నబస్సులతోనే అదనపు ట్రిప్పులు నడపాలని పేర్కొన్నారు. తిరుమలలో పదిరోజుల పాటు వైకుంఠ వాకిలి తెరిచి ఉంచడంతో ఎక్కువమంది ఆర్టీసీలో ప్రయాణించేలా చూడాల న్నారు. అలాగే క్రిస్మస్, నూతన ఆంగ్ల సంవత్సరం, సంక్రాంతి పర్వదినాలు, పాఠశాలల సెలవులు, పర్వదినాలకు సొంతూళ్లకు ప్రజలు వెళ్లడం, నగరానికి మళ్లీ తిరుగుముఖం పట్టడం వంటి ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని డిపో మేనేజర్లను ఆదేశించారు. అలాగే మహిళలకు ఉచిత ప్రయాణం అంశంపై ప్రాథమికంగా చర్చించి, ఆయా డిపోల్లో తక్కువ ఓఆర్‌తో నడుస్తున్న బస్సులను గుర్తించి చర్యలు తీసుకోనున్నారు. ఈ సమీక్షలో ఇన్‌చార్జ్ డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, పీవో సహజాద్, బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు, తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తున్నాం : బీఎస్పీ



అంబేద్కర్ విగ్రహం కూడలి వద్ద ధర్నా చేస్తున్న బహుజన సమాజ్ పార్టీ నాయకులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ఖండిస్తున్నామని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ పేర్కొన్నారు. బీఎస్పీ అధినేత్రి మాయావతి ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు ముందున్న అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రభాకర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, మతోన్మాద పార్టీలన్నీ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తొలగించి మనుధర్మశాస్త్రాన్ని తీసుకురావాలని కుటిల ప్రయత్నం చేస్తున్నాయని ఆగ్రహించారు. అందులో భాగంగానే అమిత్‌షా రాజ్యసభలో అంబేద్కర్ పట్ల వ్యంగ్యంగా మాట్లాడారని గుర్తుచేశారు. దేశ ప్రజలకు అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని కోరారు.

కూటమి పాలనలో పవిత్రత మంట కలిసింది

మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన), డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో తిరుపతి పవిత్రత మంట కలిసిందని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య విగ్రహానికి జరిగిన అపచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. 32వేల సంకీర్తనలతో వెంకటేశ్వరస్వామి మనసు గెలుచుకున్న అన్నమయ్య విగ్రహానికి శాంతాక్లాస్ టోపీని వేయడాన్ని తీవ్ర అపచారంగా పరిగణించారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్న ఈ చర్యలపై చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలని పేర్కొన్నారు. పవన్‌కళ్యాణ్ స్వామి సనాతన ధర్మంపై ఆనాడు మాట్లాడిన విషయాన్ని గుర్తు చేస్తూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ప్రతిఒక్కరూ సత్య మార్గంలో నడవండి



కెబి లేఔట్ లోని షెకీనా చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ అరుల్ అరుసు

తిరుపతి (ఆటో నగర్) డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సన్మాన మార్గంలోను, సత్యమార్గంలో నడవాలని ప్రపంచ శాంతిని ఆకాంక్షించాలని సీనియర్ పాస్టర్ అరుల్ అరసు కోరారు. మంగళవారం స్థానిక కేబీ లేఔట్‌లోని షెకీనా చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు బోధనలను వివరించారు. క్రిస్మస్ ఈవ్ క్యారల్స్‌లో యువతీయువకులు క్రిస్మస్ గీతాలు ఆలపించారు. రాత్రి నుంచి బుధవారం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని పాస్టర్ చెప్పారు. రెండు రోజులు క్రితమే చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

శ్యాం బెనగల్ మృతికి సంతాపం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 26: ప్రముఖ సినీ దర్శకులు శ్యాంబెనగల్ మృతికి ప్రజానాట్య మండలి సంతాపాన్ని తెలియజేసింది. అభ్యుదయ భావజాలం కల్గిన శ్యాంబెనగల్ మరణం, కళా రంగానికి తీరని లోటని ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య పేర్కొన్నారు. సామాజిక చైతన్యాన్ని కల్గించే అనేక సినిమాలను శ్యాంబెనగల్ రూపొందించారని కీర్తించారు. శ్యాంబెనగల్ మృతికి సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు.





ఈస్ట్ చర్చిలో ప్రార్థనలు

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చిలు

తిరుపతి (లీలామహల్), డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని ప్రధాన చర్చిలు క్రిస్మస్ వేడుకలకు సుందరంగా ముస్తాబయ్యాయి. తిరుపతి వెస్ట్‌చర్చి, ఈస్ట్ చర్చి, జగన్మాత చర్చిలతో పాటు పలు చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచే పలుచోట్ల ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.



విద్యుత్ అలంకరణలో జగన్మాత చర్చి

గాలిగోపుర మఠం ఆధునికీకరణకు కృషి

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



గాలిగోపురం మఠం సందర్శిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్నబజారు వీధిలో ఉన్న గాలిగోపురమఠం ఆధునీకరణకు కృషిచేస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన మఠం వద్దకు చేరుకోగా ఈవో మునికృష్ణమూర్తి ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీకృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భవనం లీకేజీ కారణంగా వర్షాలకు ఉరుస్తోందని ఈవో ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మరమ్మతుల ప్రతిపాదన రెండేళ్లుగా వాయిదా పడుతోందన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ 1,413లో స్థాపించిన గాలిగోపుర మఠం చరిత్ర ఘనమైనదన్నారు. మరమ్మతుల కోసం టీటీడీ నిధులు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు.

సనాతన ధర్మం గురించి మాట్లాడే అర్హత కరుణాకరరెడ్డికి లేదు

అన్నమయ్య విగ్రహానికి శాంతాక్లాజ్ టోపీ పెట్టడంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని తెలియజేశారు. పెద్ద అపచారం జరిగిందంటూ వైసీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి రాద్ధాంతం చేయడం తగదన్నారు. వైసీపీ పాలనలో ఆలయాలలో జరగని అపచారం లేదన్నారు. రథాలు తగలబెట్టడం, దేవుడి విగ్రహాలు ధ్వంసం చేయడం వంటివి లెక్కలేనన్ని చేశారని గుర్తుచేశారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాలకు వినియోగించే నెయ్యి కల్తీ కరుణాకరరెడ్డి చైర్మన్‌గా ఉండగానే జరిగిందని వివరించారు. అలాంటి ఆయనకు సనాతన ధర్మం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు సనాతన ధర్మం కాపాడేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షులు రాజారెడ్డి, ఆకేపాటి సుభాషిణి, వినోద్‌రాయల్, ఆర్కాట్ కృష్ణప్రసాద్, దినేష్‌జైన్, వెంకటేష్, సుధాకర్, టీడీపీ నాయకులు ఆముదాల తులసీరామ్, జయకుమార్, దాము, రవిశంకర్‌యాదవ్, బీజేపీ నాయకుడు వరప్రసాద్ పాల్గొన్నారు.

దేవదాయశాఖ భూములను దోచుకున్న వారిపై చర్యలు తప్పవు

నరసింహయాదవ్




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో జిల్లాలోని దేవదాయ శాఖ భూములు, తిరుపతిలోని హథీరాంజీ మఠం భూములను ఆక్రమించి దోచుకున్న వారిపై చర్యలు తప్పవని టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ నాయకులతో కలిసి మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హథీరాంజీ మఠం భూములను స్వాహా చేసేందుకు తప్పుడు పత్రాలు సృష్టించి వాటితో కోర్టులో స్టే తీసుకొచ్చి ఆ భూముల్లో ఇష్టానుసారంగా భారీ భవంతులను నిర్మించారని ఆరోపించారు. ఇదంతా అప్పటి అధికారుల సహకారంతోనే జరిగిందని ఇందుకు బాధ్యులైన ప్రతి ఒక్కరిపై చర్యలకు సీఎంకు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తామన్నారు. తిరుపతి, తిరుపతి రూరల్, చంద్రగిరి పరిధిలో వంద ఎకరాల హథీరాంజీ మఠం భూములు అన్యాక్రాంతం అయ్యాయని తెలిపారు. ఇందులో అప్పటి మంత్రుల, ఎమ్మెల్యేల పాత్ర కీలకంగా ఉందని వారు తగిన మూల్యం చెల్లించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అవినీతికి అలవాటు పడ్డ అధికారులు తీరు మార్చుకోకపోతే ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించారు. అలాగే బీసీలకు రక్షణగా అట్రాసిటీ చట్టాన్ని త్వరలోనే కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకురానుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఊకా విజయ్‌కుమార్, టీడీపీ తిరుపతి పార్లమెంటు కార్యాలయ కార్యదర్శి మనోహర్‌ఆచారి, నాయకులు కరాటే చంద్ర, సుబ్బుయాదవ్, రాజయ్య, రవిశంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకి విరుద్ధంగా మార్కుల కేటాయింపుపై వాస్తవాలను తేల్చండి

వెటర్నరీవర్సిటీ వీసీ, డీన్‌లకు విద్యార్థి సంఘాల నాయకుల వినతి



తిరుపతిరూరల్, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో బీవీఎస్సీ తృతీయ సంవత్సరం చదివే ఓ విద్యార్థికి నిబంధనలకు వ్యతిరేకంగా కేటాయించిన మార్కుల అభియోగంపై వాస్తవాలను నిగ్గుతేల్చి బాధ్యులైన ప్రొఫెసర్‌పై చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాల నేతలు కోరారు. ఈ మేరకు అఖిలపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వర్సిటీ పరిపాలనా భవనంలోని వీసీ చాంబర్‌లో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవికుమార్, వెటర్నరీ డీన్ ప్రొఫెసర్ కె.వీరబ్రహ్మయ్యను కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పారాసైటాలజీ విభాగంలో ఉన్నతవర్గానికి చెందిన విద్యార్థికి గతంలో వచ్చిన మార్కులని తారుమారు చేసి ఎక్కువ మార్కులు వేశారని ఆరోపించారు. గతంలో ఇదే ప్రొఫెసర్ బలహీనవర్గాల విద్యార్థుల పట్ల పక్షపాతం చూపారని, ఉన్నతవర్గానికి చెందిన విద్యార్థి కావడంతో ఇప్పుడు నిబంధనలను అతిక్రమించి మార్కులు కేటాయించారని ఆరోపించారు. ఆ ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇన్‌చార్జి వీసీ, డీన్‌లు మాట్లాడుతూ విచారణ కమిటీ ఏర్పాటు చేశామని కమిటీ నివేదిక వచ్చాక వాస్తవం తెలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ఆర్కేనాయుడు, బీసీ విద్యార్థి విభాగం రాయలసీమ అధ్యక్షుడు ఉత్తరాది విజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవికుమార్, జైభారత్ నేషనల్ పార్టీ రాయలసీమ ఇన్‌చార్జి భార్గవ్‌కుమార్, గిరిజన సంఘ రాష్ట్ర నాయకులు సురేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఈపీఎస్ సేవలను సద్వినియోగం చేసుకోండి



మీడియాతో మాట్లాడుతున్న డాక్టర్ నాగరాజు

తిరుపతి (వైద్యం), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత జీవనశైలిలో పెరుగుతున్న గుండె సంబంధిత వ్యాధులను దృష్టిలో పెట్టుకొని తిరుపతిలో మొట్ట మొదటిసారిగా సంకల్ప ఆస్పత్రిలో ఈపీఎస్(ఎలక్ట్రో ఫిజియాలజీ స్టడీ) సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని గుండె సంబంధిత వైద్య నిపుణుడు నాగరాజు తెలిపారు. స్థానిక సంకల్ప ఆస్పత్రిలో ఆయన మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ పట్టణాల్లో మాత్రమే అందుబాటులో ఉన్న అధునాతన గుండె సంబంధిత వైద్య సేవలను తిరుపతి ప్రజలకు చేరువచేసేందుకు సంకల్ప ఆస్పత్రిలో శ్రీకారం చుట్టామన్నారు. మొదటిసారిగా ఈపీఎస్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని దీంతో గుండె ఎలక్ట్రికల్ యాక్టివిటీ ఎలా ఉందో ఇట్టే తెలుసుకోవచ్చని తద్వారా గుండె సంబంధిత సమస్యలను ముందే తెలుసుకొని తగిన వైద్యం అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ విధానంతో ఇప్పటికే పలువురు రోగులకు గుండె సమస్యలను గుర్తించి తక్షణ వైద్యం అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అనంత్‌నాగ్, డాక్టర్లు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం



కార్యక్రమంలో మాట్లాడుతున్న యూనియన్ నేతలు

తిరుపతి(వైద్యం), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏడు దశాబ్దాలుగా ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగిస్తూ ఎన్నో విజయాలను సాధించిందని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు అన్నారు. ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని రుయాస్పత్రిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు విచ్చేసి యూనియన్ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు మాట్లాడుతూ యూనియన్ నేతలు సమష్టిగా ఉన్నప్పుడే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆ దిశగా ప్రతిఒక్కరూ ఐక్యతతో ముందుకు సాగాలన్నారు. అనంతరం యూనియన్ సాధించిన విజయాలు, చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మహేంద్ర, సురేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపట్టాలివ్వండి



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

తిరుపతిరూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అవిలాల గ్రామ పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ కాలనీ, సుబ్బయ్య కాలనీ, శానప్పకాలనీ, వినాయకనగర్‌లలో దాదాపు మూడు దశాబ్దాలుగా స్థిర నివాసాలు ఏర్పచుకుని జీవనం సాగిస్తున్నామని, తమకు ఇంటిపట్టాలు లేదా ఎంజాయ్‌మెంట్ సర్టిఫికెట్లు (పొజిషన్) మంజూరుచేసి న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు. తిరుపతిరూరల్ మండలం అవిలాల పంచాయతీ సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ రామాంజులునాయక్ అర్జీలు స్వీకరించారు. అవిలాల రెవెన్యూ పరిధిలోని పలు పంచాయతీలకు శ్మశానస్థలం, డంపింగ్ యార్డుకు స్థలం మంజూరు చేయాలని, సాయినగర్‌కి మంజూరు చేసిన పార్క్ స్థలాన్ని స్వాధీనం చేయాలని, ఇంటిపట్టాలు ఇచ్చిన వారికి స్థలం చూపాలని సర్పంచ్‌లు కోరారు. అవిలాలలో సర్వేనంబరు 25లోని కాలువ అన్యాక్రాంతానికి గురైందని, సర్వేచేసి ఆక్రమణలు తొలగించాలని, గుడిమాన్యానికి రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని పలువురు విన్నవించారు. ఆర్ఐ రఘువర్మ, సర్వేయర్ హేమకుమార్, టీడీపీ నాయకులు కురకాల్వ సుధాకర్, సాంబశివరావు, సర్పంచ్‌లు చెందిలి వెంకటరమణ, డీవీరమణ, ముసుగు కోటేశ్వరరావు, గాంధీపురం ఎంపీటీసీ జయకర్, ప్రజలు పాల్గొన్నారు.

శ్మశానదారిలో మొక్కల తొలగింపు పనులు

తిరుపతిరూరల్, డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం గ్రామ పంచా యతీ పరిధిలోని కొత్తహరిజనవాడ శ్మశానదారికి వెళ్లే మార్గంలో అడ్డుగా ఉన్న మొక్కలు, ముళ్లకంపల తొలగింపు పనులను ఎక్స్‌కవేటర్ సాయంతో చేపడుతున్నారు. అలాగే గుంతలుగా ఉన్న చోట్ల చదును చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి బి.శివకుమార్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మనోహర్ చౌదరి, నాయకులు నవీన్‌రాజు, సావలి, ప్రసాద్ పాల్గొన్నారు.

వినియోగదారులు హక్కులను కాపాడుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్నేహలత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 26: వినియోగదారులు తమ హక్కులను కాపాడుకోవలసిన అవసరం ఉందని వినియోగదారుల కమిషన్ అధ్య క్షురాలు స్నేహలత పేర్కొన్నారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. వినియోగదారులు నాణ్యత, సేవ లోపాలపై కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లా వినియోగదారుల కౌన్సిల్ అధ్యక్షులు రాజారెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్, డిజిటల్ వ్యాపారాలు, అసత్య ప్రకటనలు, కల్తీ పదార్థాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఫుడ్‌సేఫ్టీ అధికారి మద్దిలేటి మాట్లాడుతూ వస్తువు తయారీ తేదీ, గడువు ముగింపు తేదీ, నాణ్యత, రుచి, వాసన, ధర గమనించాలని ఇందులో తేడా ఉంటే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తూనికలు, కొలతల శాఖ అధికారి స్వామి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, కామర్స్ హెడ్ మల్లికార్జునరావు, డీటీలు జయరాజ్, సురేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల దినోత్సవాన్ని పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు స్నేహలత, విశ్రాంత జడ్జి శశిధర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు భాను, యువశ్రీ, విద్యావతి మాట్లాడారు. వస్తువుల నాణ్యత, కొలతలు, ధరల విషయంలో వినియోగదారులకు హక్కులు ఉంటాయన్నారు. ఆన్‌లైన్ కొనుగోళ్ల విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వస్తువుల నాణ్యతలో లోపం ఉంటే వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి : కాంగ్రెస్



డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను రాజ్యసభలో అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు బాబా సాహెబ్ అంబేద్కర్ సమ్మాన్ మార్చ్ కార్యక్రమం జరిగింది. తిరుచానూరు ఫ్లైఓవర్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్‌షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. అనంతరం డీఆర్వో నరసింహులుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబు, చిట్టిబాబు, వెంకట నరసింహులు, శివశంకర్, వెంకటాచలపతి, దామోదర్‌రెడ్డి, రామకృష్ణ, సుప్రజ, నరేంద్ర, గోపి, మల్లికార్జున పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్



తిరుపతి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా రుద్రకోటి సదాశివం మంగళవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కలిశారు. ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సదాశివాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు ఊట్లవారిపల్లి మునిరత్నం, గోవిందశెట్టి, రామచంద్రయ్య, మునిరత్నం, నారాయణ, సుబ్రమణ్యం, మణి, మురళి, చంద్రశేఖర్, కోటేశ్వర్, ఎల్.నారాయణ తదితరులు పాల్గొన్నారు.




మంచుకొండలు కాదు.. మనూరే!

ప్రకృతి బహు విచిత్రమైనది. ఒక్కోసారి కశ్మీరం అవతలుండే కాంచన జంగనూ, విశాఖ అవలవుండే లంబసింగ్ లోయనూ కూడా మన కళ్ల ముందుకు తెస్తుంది. మబ్బులు కమ్మిన మంగళవారం సాయంత్రం తిరుపతి ఫ్లై ఓవర్ మీదుగా తిరుచానూరు వైపు ప్రయాణిస్తున్న వారికి కనువిందు చేసిన దృశ్యం ఇది. తెల్లమబ్బుల ముట్టడిలో అప్పలాయగుంట నల్లకొండలు ఇలా కనిపించాయి.

- రేణిగుంట, ఆంధ్రజ్యోతి

హుండీ ద్వారా రూ.4.12 కోట్లు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 29 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం : రూ.4.15 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 65,656

తలనీలాలు సమర్పించినవారు : 24,360

సేవా పరిమళం @ 160 ఏళ్లు





ఆగస్టమీలియస్ విగ్రహం

నాయుడుపేటలో 160 ఏళ్ల చరిత్రను సొంతం చేసుకున్న లూథరన్ చర్చి సేవకు చిరునామాగా నిలుస్తోంది. సేవలను విశ్వవ్యాప్తం చేసే క్రమంలో ఆగస్టమీలియస్ ఆధ్వర్యంలో 1865లో నాయుడుపేటలోని 15 ఎకరాల్లో ఈ చర్చి మొదలైంది. ఈ ప్రార్థనాలయం నేటికీ చెక్కుచెదరని చారిత్రాత్మక కట్టడాలకు తార్కాణంగా నిలుస్తుంది. నాడు బాగా వెనుకబడిన ఈ ప్రాంతంలో చర్చి ఆధ్వర్యంలో పలు విద్యాలయాలు ఏర్పాటయ్యాయి. వైద్య సేవలను దగ్గరకు చేర్చి బాధితులకు అక్కున చేర్చుకుంది. కుటుంబ ఆదరణ కోల్పోయిన, వితంతు, వృద్ధులను ఆగస్టమీలియస్ స్త్రీబా హోమ్ ఏర్పాటు చేసి అండగా నిలిచారు. జర్మనీ నుంచి మీలియస్ మనదేశంలో అడుగుపెట్టాక ఇక్కడి స్థితిగతులకు చలించిపోయారు. సేవకు అంకితం కావాలని సంకల్పించారు. ఇందులో భాగంగా చెన్నై, సూళ్లూరుపేట, నాయుడుపేట, రాజమండ్రి, గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి, రాపూరు, కోడూరు, వాకాడు తదితర ప్రాంతాల్లో చర్చిలను ఏర్పాటు చేశారు. సేవామూర్తిగా పదుగురి గుండెల్లో నిలిచిపోయారు. 1887 మే 21న ఈ కరుణామయుడు నాయుడుపేట చర్చిలోనే తుదిశ్వాస విడిచారు. దీంతో మీలియస్ సమాధిని చర్చిలోనే ఏర్పాటు చేశారు.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి

విద్యాకాంతులకు ప్రతీక





ఎస్‌ఏఎల్‌సీ చర్చి - క్రిస్మస్ సందర్భంగా ముస్తాబువుతున్న చర్చిలోని ప్రాంగణం

జర్మనీకి చెందిన డాక్టర్ మీలియస్ చొరవతో 1867లో గూడూరులో సెయింట్ పాల్ పీటర్స్ లూథరన్ (ఎస్‌ఏఎల్‌సీ) చర్చి ఏర్పాటైంది. ప్రార్థనలకే పరిమితం కాకుండా ఈ చర్చి సేవాపరిమళాలను వెదజల్లింది. ఇంగ్లీషు మీడియం పాఠశాల, వసతి గృహాన్ని నిర్వహించి అట్టడుగు వర్గాల్లో విద్యజ్యోతులను వెలిగించింది. ఎస్‌ఎంజీ పాఠశాల ఎందరో విద్యార్థులకు బతుకుదారి చూపించింది. అప్పటిలోనే ఇంగ్లీష్ మీడియంలో ఇక్కడ బోధించేవారు. గూడూరుతో పాటు చిల్లకూరు, మనుబోలు, సైదాపురం, బాలాయపల్లి ప్రాంతాల నుంచీ వేల సంఖ్యలో ప్రజలు ఈ చర్చికి వచ్చేవారు. 157 ఏళ్ల చరిత్ర కలిగిన సెయింట్ పాల్ పీటర్స్ లూథరన్ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా మతాలకు అతీతంగా ప్రజలు వేడుకల్లో పాల్గొంటారు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

పుత్తూరులో 117 ఏళ్ల చర్చి



పుత్తూరులో బ్రిటిష్ కాలంలో కోన్‌లాగా నిర్మించిన ఈ ఎత్తయిన చర్చి... పట్టణానికి మరో వారసత్వపు ఆభరణం. దక్షిణ భారత సెయింట్ లూథరిన్ చర్చి ఆధ్వర్యంలో 1907లో ఈ చర్చిని నిర్మించారు. 2007లో వందేళ్ల ఉత్సవాలను నిర్వహించారు. కిలోమీటరు నుంచి చూసినా కనిపించే ఈ భవనాన్ని క్రైస్తవులు భద్రంగా కాపాడుకుంటున్నారు. దాదాపు వంద మంది కూర్చుని ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా ఈ భవనం వుంది.

- పుత్తూరు, ఆంధ్రజ్యోతి

నారావారిపల్లె సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి: ప్రద్యుమ్న



సమావేశంలో మాట్లాడుతున్న సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న

శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఎం స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లె సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎంవో కార్యదర్శి ప్రద్యుమ్న సూచించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పరిపాలనా భవనంలో మంగళవారం ఆయన జిల్లాలోని పలు అభివృద్ధి ప్రాజెక్టులపై అధికారులతో సమీక్షించారు. అసెట్స్ సర్వే చేపట్టాలని, స్వయంశక్తి ప్లస్, వృత్తి నైపుణ్యం యువతకు అవసరమైన పరిశ్రమలు, ఉపాధి శిక్షణ స్కిల్ ప్రొఫైల్ సిద్ధం కావాలన్నారు. జిల్లాలో తిరుమల, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలు, సముద్రతీరం, ఐఐటీ వంటి కేంద్ర విద్యాసంస్థలు, ఈఎంసీ, శ్రీసిటీ, షార్, గుడిమల్లం ఆలయం వంటి విశేషమైన డైవర్సిఫైడ్ సిస్టం ఉండటం విశేషమన్నారు. యూనిక్ ప్రొడక్ట్ మిషనరీ ఉపయోగించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. మామిడికి ప్రత్యామ్నాయంగా ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలన్నారు. కనీసం రెండు అటానమస్ డ్రోన్లనయినా అందుబాటులోకి తీసుకురావడం ద్వారా పోలీసు శాఖ అవాంఛనీయ సంఘటనలను అరికట్టవచ్చన్నారు. స్టాండ్అప్ ఇండియా, ఎంఎస్ఎంఈ తదితర పథకాల కింద బ్యాంకుల సహకారంతో కొత్తయూనిట్లు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పీఎం సూర్యఘర్ యోజన, ఊర్జా మిత్ర పథకాల గురించి చర్చించారు. గ్రామీణ రోడ్లకు మరమ్మతులు, సిమెంటు రోడ్ల ఆవశ్యకతపై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి కుటుంబం నుంచీ ఫ్యామిలీ ప్రొఫైల్ తయారు చేయాలన్నారు. జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

సుడిగాలి పర్యటన

రేణిగుంట నుంచి నాయుడుపేట వరకు ఆరులేన్ల జాతీయ రహదారిని పరిశీలిస్తూ.. పనుల పరోగతిని ప్రద్యుమ్న ఆరాతీశారు. నాయుడుపేట ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద పనులను పరిశీలించారు. ఇక నాలుగు శాతం పనులు మిగిలాయని రోడ్డునిర్మాణ సంస్థ నిర్వాహకులు వెల్లడించారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్నారు.

నారావారిపల్లెలో ఇలా..

నారావారపల్లెలో చేపట్టబోయే పనుల గురించి కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. పాఠశాలల్లో అధునాతన మౌలిక సదుపాయాలు, డిజిటల్ తరగతి గదులను శ్రీసిటీ ద్వారా రూ.80లక్షల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. యువతకు వృత్తి విద్య నైపుణ్య శిక్షణ.. పాడి పశువులకు గోకులాలు.. 242 స్వయం సహాయక మహిళా సంఘాలకు డ్రోన్ నిర్వహణ, ఈ-ఆటో కింద కొందరికి రుణ సదుపాయం కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, ఆర్డీవోలు భానుప్రకాష్‌రెడ్డి, రామ్మోహన్, డీపీవో సుశీలదేవి, అధికారులు పాల్గొన్నారు.

● తిరుమల నుంచి తిరుగు ప్రయాణంలో..

వేగం తెచ్చిన అనర్థం

- వృద్ధురాలి మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు
- పరమేశ్వర మంగళం వద్ద ఘటన
- సురక్షితంగా బయట పడ్డ చిన్నారి



గాయపడిన వైష్ణివేతిలి



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

పుత్తూరు అర్బన్, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని దర్శించుకుని చెన్నై కీలంబాకంకు బయలుదేరిన నెం.టీఎన్ 66 క్యూ 9263 కారు ప్రమాదానికి గురైంది. పుత్తూరు సమీపంలోని పరమేశ్వర మంగళం వద్ద ఉదయం 11.15 గంటలకు ప్రమాదం జరిగింది. ఇదే గ్రామం హరిజనవాడకు చెందిన ఐలయ్య భార్య శాంతకుమారి(60) రోడ్డు దాటుతుండగా కారు ఆమెను వేగంగా ఢీ కొంది. ఈ క్రమంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, అదుపు తప్పిన కారు రోడ్డు పక్కన ఉన్న బండరాయిని ఢీకొట్టింది. కారు నుజ్జునుజ్జు అయింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు తల్లి సీతాలక్ష్మీ, తండ్రి పళినిస్వామి, కుమారుడు నవనీత కృష్ణ, కోడలు వైష్ణివేతిలికి తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి సురక్షితంగా బయటపడింది. ప్రమాదాన్ని గమనించిన గ్రామస్తులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కారును నవనీత కృష్ణ నడుపుతున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన శాంతకుమారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలకు హాజరైన వారిపై దూసుకెళ్లిన కారు

- ముగ్గురికి తీవ్రగాయాలు
- ఒకరి మృతి
- పాక్షికంగా దెబ్బతిన్న పలు ద్విచక్ర వాహనాలు, ఆటో



కారు దూసుకెళ్లడంతో దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలు



మృతి చెందిన కొండారెడ్డి

ఏర్పేడు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): అంత్యక్రియలకు హాజరైన వారిపై కారు దూసుకెళ్లిన ఘటనలో వృద్ధుడు మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని నచ్చనేరి పంచాయతీ దుర్గిపేరికి చెందిన గాది వెంకటేష్(35) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. వెంకటేష్ అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం 2గంటలకు గ్రామం వద్ద నిర్వహిస్తుండగా వెంకటగిరి నుంచి తిరుపతి వైపు వెళుతున్న కారు అదుపు తప్పి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో దుర్గిపేరికి చెందిన కొండారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డితో పాటు కృష్ణంపల్లికి చెందిన గెరటారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అంతేకాకుండా రోడ్డు పక్కనే ఉన్న పలు ద్విచక్ర వాహనాలు, ఆటో దెబ్బతిన్నాయి. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు ఆటోలో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొండారెడ్డి(75) మృతి చెందాడు. మిగిలిన వారు చికిత్స పొందుతున్నారు. కొండారెడ్డికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

పరకామణి దొంగతనంపై 'ఎంక్వైరీ కమిషన్' వేయండి

● టీటీడీ చైర్మన్‌కు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి విజ్ఞప్తి



చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న భానుప్రకాష్

తిరుమల, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ లెక్కింపుల పరకామణిలో దొంగతనం కేసుపై 'ఎంక్వైరీ కమిషన్' వేయాలంటూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి మంగళవారం సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. అనంతరం భానుప్రకాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గతంలో పరకామణిలో పనిచేసిన రవికుమార్ దొంగతనం చేయగా కేసు పెట్టారని, పోలీసుల ఒత్తిడితో లోక్‌అదాలత్‌లో రాజీపడ్డామని అప్పుడు పనిచేసిన విజిలెన్స్ అధికారులు నివేదిక ఇచ్చారని, దానిపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. తిరుపతి, చెన్నైలోని రవి కుమార్ ఆస్తులను టీటీడీకి బదిలీ చేశారన్నారు. ఈ పంచాయితీ ఏంటని ఆయన ప్రశ్నించారు. రాజీకి పొమ్మని చెప్పిన పోలీసు అధికారులు ఎవరో తెలియాలన్నారు. దీనిపై కమిషన్ వేసేంతవరకు బోర్డు సభ్యుడిగా పోరాడతానని చెప్పారు.

'పద్మావతి' సముదాయం లీజు రద్దుపైనా..

తిరుచానూరులోని టీటీడీకి చెందిన పద్మావతి యాత్రికుల వసతి సముదాయం కలెక్టరేట్‌కు ఇచ్చారని, దాని లీజు రద్దుపై పోరాటం కొనసాగిస్తానని భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం కలెక్టరేట్‌కు కేటాయించడంపై తాను హైకోర్టుకు వెళ్లానన్నారు. గత ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లి ట్రాన్సిట్ అకామిడేషన్ త్వరలోనే తెలియజేస్తామని, అప్పటివరకు టీటీడీకి నెలకు రూ.21.50 లక్షల అద్దెను జీఎస్టీసహా చెల్లిస్తామని తెలిపిందన్నారు. తాజాగా లీజును మరో మూడేళ్లకు పెంచడంతో పాటు క్లీనింగ్ కోసం రూ.7 లక్షలు కూడా టీటీడీనే ఇవ్వాలంటూ కలెక్టరేట్ నుంచి లేఖ వచ్చిందన్నారు. ఈ క్లీనింగ్ నిధులను ఆపడంతో పాటులీజు రద్దు చేయాలని చైర్మన్‌ను కోరానన్నారు.

రూ.20 లక్షల ఎర్రచందనం దుంగల స్వాధీనం

● ముగ్గురు ప్రధాన స్మగ్లర్ల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

మంగళం, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా నాగలాపురం మండలం రెప్పాల తిప్ప సమీప అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడులు చేశారు. రూ.20లక్షల విలువైన 69 ఎర్రచందనం దుంగలతో పాటుగా ముగ్గురు ప్రధాన స్మగ్లర్లను, ఐదుగురు కూలీలను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇంచార్జి, ఎస్పీ సుబ్బరాయుడు కథనం మేరకు.. టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి అందిన సమాచారంతో సోమవారం రాత్రి రెప్పాల తిప్ప అటవీ ప్రాంతంలో ఆకస్మిక దాడులు చేశారు. అక్రమంగా రవాణా చేయడానికి సిద్ధంగా ఉంచిన 69 ఎర్రచందనం దుంగలను, కేవీబీపురానికి చెందిన సురేంద్ర, నాగలాపురానికి చెందిన మునివేలు, తమిళనాడు సేలం జిల్లాకు చెందిన మేస్త్రి సెల్వరాజ్ తొరైస్వామి అనే ముగ్గురు స్మగ్లర్లను, తమిళనాడుకు చెందిన ఐదుగురు కూలీలను అదుపులోకి తీసుకున్నారు. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న ప్రధాన స్మగ్లర్లను అరెస్టు చేయడానికి దర్యాప్తు చేస్తున్నారు. కేసు చేదనలో ప్రతిభ చూపిన ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీ ఎండీ షరీఫ్, ఆర్‌ఐ చిరంజీవి, ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్, ఆర్‌ఎస్‌ఐ నరేష్, సిబ్బందిని ఇన్చార్జి సుబ్బరాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

యూటీఎఫ్ అధ్యక్షుడిగా రాజశేఖర్



రాజశేఖర్ - ముత్యాలరెడ్డి - మధుసూదన్‌రెడ్డి

తిరుపతిరూరల్ (గాంధీరోడ్డు), డిసెంబరు24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశాల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జీజే రాజశేఖర్, ప్రధానకార్యదర్శిగా కె.ముత్యాలరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా దండు రామచంద్రయ్య, సహాధ్యక్షులుగా ఎం.కుమారస్వామి, గీతమ్మ, కోశాధికారిగా కె.మోహన్‌బాబు, కార్యదర్శిగా బండి మధుసూదన్‌రెడ్డి (తిరుపతి), ఎస్.శేఖర్, ప్రభాకర్, సుధీర్, మస్తానయ్య, హరిబాబు, సురేష్, పద్మజ, విజయ్‌కుమార్, వెంకటకృష్ణ, ఆదినారాయణ, విజయశ్రీ, గోవర్ధన్‌రెడ్డి, హేమాంబరధరరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా నిర్మల, ముత్యాలరెడ్డి, రాజశేఖర్, వాసుదేవరావు, సదాశివరెడ్డి, సునీల, రమేష్ నాయుడు, నాగరాజు, కోటేశ్వరరావు, ఆడిట్ కమిటీ సభ్యులుగా మోహన్, శివకుమార్, నాగేశ్వరరావు, సురేష్, చంద్రశేఖర్, దీపిక, రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

ముక్కంటి సేవలో జపనీయులు



శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళవారం 8 మంది జపాన్ దేశస్థులు దర్శించుకున్నారు. ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని వారు పేర్కొన్నారు. ఆలయ సూపరింటెండెంట్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ లోగోతో తిరుమలకు కారు





తిరుమల, డిసెంబరు24(ఆంధ్రజ్యోతి): టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా తెలుగుదేశం పార్టీకి చెందిన లోగోతో ఓ కారు తిరుమలకు వచ్చింది. సాధారణంగా రాజకీయ గుర్తులు, జెండాలు, వ్యక్తుల ఫొటోలు, చిహ్నాలతో తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరి వద్ద తనిఖీల్లో భద్రతా సిబ్బంది గుర్తించి అడ్డుకోవాలి. అయినా, మంగళవారం పద్మావతి ఏరియాలో ఓ వాహనంపై టీడీపీ లోగో ఉండటం చర్చనీయాంశంగా మారింది. అలిపిరి వద్ద తనిఖీల లోపం వల్లే ఇలా జరిగిందన్న విమర్శలున్నాయి.

27న వాలీబాల్ జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 27న శాప్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ వాలీబాల్ జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆ రోజున ఉదయం 7గంటలకు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్, పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలతో హాజరుకావాలని తెలియజేశారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 7నుంచి 13వరకు జైపూర్‌లో జరిగే సీనియర్ పోటీలకు అర్హత సాధిస్తారని వివరించారు.

సైబర్ ఉచ్చులో శ్రీసిటి ఉద్యోగి

● ఖాతాలో రూ.లక్ష మాయం

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడి శ్రీసిటి ఉద్యోగి ఆర్ఎస్ రెడ్డి తన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.లక్ష పోగొట్టుకున్నారు. సూళ్లూరుపేటలో జరిగిన ఈ విషయం మంగళవారం వెలుగు చూసింది. ఈయన మొబైల్‌కు రెండు రోజుల కిందట ఓ యాప్ వచ్చింది. దీనిని సద్వినియోగం చేసుకొంటే సులభంగా నగదు సంపాదించవచ్చనే మెసేజీ యాప్‌లో వచ్చింది. ఆ యాప్‌ను ఓపెన్ చేయడంతో నాలుగు విడతలుగా ఈయన ఖాతాలో ఉన్న రూ.లక్ష వరకు డ్రా అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భీములవారిపాలెంలో బోటు షికారు

● జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దనరెడ్డి

తడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పక్షుల పండుగకు వచ్చే పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచడానికి భీములవారిపాళెం రేవులో బోటు షికారు ఏర్పాటు చేస్తున్నట్లు పర్యాటకశాఖ అధికారి జనార్దనరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన భీములవారిపాళెం పడవల రేవును ఆర్డీవో కిరణ్మయి, డీఎస్పీ చెంచుబాబుతో కలిసి పరిశీలించారు. బోటు షికారు ఏర్పాట్లపై ఆరా తీశారు. రేవు పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. బోటు షికారుకు పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వచ్చే ఆస్కారం ఉన్నందున 30 పడవల వరకు ఏర్పాటు చేయాలని మత్స్యకార నాయకులకు ఆర్డీవో కిరణ్మయి సూచించారు. ఈ కార్యక్రమంలో వన్యప్రాణి విభాగం డీఎఫ్‌వో హారిక, తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో విజయకుమార్, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు, సర్పంచు గీతాప్రకాష్, టీడీపీ నాయకులు బొమ్మన శ్రీధర్, సుధాకర్, జయపాల్, వాసు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఆరుగురికి పదేళ్ల జైలు

● రూ.20 వేల జరిమానా

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఆరుగురు నిందితులకు పదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. సూళ్లూరుపేటకు చెందిన ఓ బాలికకు మోసపూరిత మాటలు చెప్పి లైంగికంగా వేధించిన ఆరుగురిపై 2014లో పోక్సో కేసు నమోదైంది. మంగళవారం నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ విచారణ పూర్తిచేసి నేరం రుజువు కావడంతో నిందితులు మల్లపు భానుప్రకాష్, మల్లపు వెంకటేశ్వర్లు, మల్లపు సుభాషిణి, అక్కరపాక స్వాతి, అక్కరపాక రమేష్, రేపూరి మాల కొండయ్యకు పదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

లా కోర్సుల్లో ప్రవేశానికి రేపు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ నిర్వహిస్తున్న లా కోర్సుల్లో ప్రవేశానికి గురువారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 10 గంటలకు అడ్మిషన్ల కార్యాలయంలో సంప్రదించాలని వర్సిటీ అడ్మిషన్ల డైరెక్టర్ ఊకా రమేష్‌బాబు తెలిపారు.

పుత్తూరు వార్తలు

వినియోగదారులు హక్కులను కాపాడుకోవాలి

పుత్తూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రూపొందించిన చట్టాలను ప్రతి వినియోగదారుడు తెలుసుకుని హక్కులను కాపాడుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాల వాణిజ్య విభాగం, కన్జూమర్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి కొనుగోలుకు డబ్బు చెల్లిస్తున్నందున వస్తువుల గురించి తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందన్నారు. అధ్యాపకులు దేవకి, వాసవి, తిరుమలయ్య, గంగయ్య, లక్ష్మీబాయి, జ్యోతి, నాగరాజులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి పగటి పూట విద్యుత్ సరఫరా చేయాలి



సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్న వినియోగదారులు

పుత్తూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి పగటి పూట విద్యుత్‌ను సరఫరా చేయాలని సబ్‌స్టేషన్ కమిటీ సమావేశంలో రైతులు కోరారు. పరమేశ్వరమంగళం సబ్‌స్టేషన్ కమిటీ సమావేశంలో రైతులు మాట్లాడుతూ... పొలాల్లో ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని కోరారు. సూర్యఘర్ పథకం కింద రాయితీతో ఇళ్ల మీద సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసుకుని డబ్బును ఆదా చేసుకోవచ్చని టెక్నికల్ ఈఈ వాసవి లత సూచించారు. ఈ సమావేశంలో పుత్తూరు ఈఈ దేవ ఆశీర్వాదం, ఏడీఈ శంకరయ్య, ఏఈ రవికుమార్ పాల్గొన్నారు.

మధ్యంతర భృతిని ప్రకటించాలి

పుత్తూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులకు 12 వ పీఆర్సీ ఆలస్యం అవుతున్నందున 30శాతం మధ్యంతర భృతిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల మెయిన్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉద్యోగులకు చెల్లించాల్సిన రూ.2500 కోట్ల బకాయిలను కూడా వెంటనే జమ చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు ఏకీకృత నిబంధనలు అమలు చేయాలని, జూనియర్ కళాశాలల్లో ఖాళీలను 40శాతం హైస్కూలు ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగరాజు కోరారు. బోధనేతర పనులను మినహాయించాలని, ఆంగ్లంతో పాటు తెలుగు బోధనను కొనసాగించాలని జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆపస్ నాయకులు తేజోమూర్తి, శివకుమార్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచుకు ఎమ్మెల్యే భాను నివాళులు



పుత్తూరు అర్బన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని మిట్టపల్లూరుకు చెందిన మాజీ సర్పంచు గోవిందస్వామి రెడ్డి మృతి పట్ల ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ విచారం వ్యక్తం చేశారు. మంగళవారం గోవిందస్వామి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించిన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

పవర్ లిఫ్టింగ్‌లో వడమాలపేట క్రీడాకారుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పతకాలు సాధించిన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్

వడమాలపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపి బంగారు, వెండి పతకాలు సాధించారు. ఈ నెల 22, 23 తేదీల్లో ఎన్టీఆర్ జిల్లా కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 19 పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఉదయ్‌కుమార్ 83 (కిలోలు), చరణ్‌కుమార్ (కిలోలు) విభాగంలో బంగారు పతకాలను సాధించారు. అలాగే స్వీటీ కుమారి 63 (కిలోలు) విభాగంలో వెండి పతకాన్ని సాధించింది. వారిని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమ్మ, ఫిజికల్ డైరెక్టర్లు జయరామయ్య, చంద్రశేఖర్ రాజు అభినందించారు.

రాయితీతో విత్తనాల పంపిణీ



వడమాలపేట, డిసెంబరు 24(ఆంధ్ర జ్యోతి): తుఫాన్‌తో దెబ్బతిన్న వరి పంటకు పరిహారం కింద రాయితీతో విత్తనాలను పంపిణీ చేశారు. ఇటీవల వర్షాల కారణంగా పంట నష్టపోయిన టీసీ అగ్రహారం, పాదిరేడు, తట్నేరి గ్రామాలకు చెందిన రైతులకు 80 శాతం రాయితీతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో తట్నేరి చెరువు సాగు నీటి సంఘం అధ్యక్షుడు మురళి, మునికృష్ణ, విద్యాసాగర్, అయ్యప్ప, వ్యవసాయాధికారి విజయకుమార్, ఏఈవో సాగర్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

వడమాలపేట, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులకు అండగా ప్రభుత్వం చేయూతనిస్తోందని జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి చెప్పారు. మంగళవారం కాయంపేటలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ... రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారం దిశగా సదస్సులు నిర్వహిస్తోందన్నారు. తహసీల్దార్ జరీనా మాట్లాడుతూ... సదస్సులో 82 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. సదస్సులో టీడీపీ నాయకులు ఉమాపతిరావు, వెంకటేష్, వెంకటరమణ పాల్గొన్నారు.



పుత్తూరు పట్టణంలో క్రిస్మస్ వేడుకలకు, ప్రత్యేక ప్రార్థనలకు విద్యుద్దీపాలంకరణలో సిద్ధమైన సెయింట్ లూథరన్ చర్చి

\- పుత్తూరు, ఆంధ్రజ్యోతి

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

మహిళపై దాడి చేసిన వారిపై కేసు

చిట్టమూరు, డిసెంబర్ 24(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం అరవపాళెం గ్రామంలో ఈనెల 21న మహిళపై దాడి చేసిన వారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. అరవపాళెం గ్రామానికి చెందిన నల్లమాకల రమణమ్మ అరవపాళెం సచివాలయ సమీపంలో గొర్రెలు మేపుకుంటుండగా ఆమె భర్త సుబ్రహ్మణ్యం, ఆయన బంధువులు దాడి చేశారు. 60 గొర్రెలను బలవంతంగా వ్యాన్‌లో ఎక్కించుకుని వెళ్లారని రమణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి భర్త సుబ్రహ్మణ్యంతో పాటు ఆయన బంధువులు 7మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

కోట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్యామసుందరపురం గ్రామానికి చెందిన కొండాపురం అంకమ్మ అనే మహిళ వద్ద నుంచి 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని, ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

ఎక్కడ చూసినా చెత్త కుప్పలే!

- అపరిశుభ్రంగా రోడ్లు
- పారిశుధ్య లోపంతో జనం అవస్థలు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. పలు వార్డుల్లో ప్రజలు కుండీల్లో పడేసే చెత్తను పారిశుధ్య కార్మికులు తొలగించడం లేదు. కుండీలు నిండిపోయి చెత్త రోడ్డుపైకి చేరుతోంది. పందులు, కుక్కలు, ఆవులు చెత్త కుప్పల వద్ద సంచరిస్తుండడంతో పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయి. దీంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులకూ ఇబ్బందులు తప్పడంలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్డుపై చెత్త కుళ్లిపోయి దుర్వాసన వస్తుండడంతో పాటు పారిశుధ్యం లోపిస్తుండడంతో అంటువ్యాధులు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పట్టణంలో చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



తోలిమిట్టలో రోడ్డుపై చెత్త

మున్సిపాలిటీలో గాడి తప్పుతున్న పాలన

రెండు నెలలకుగా మున్సిపల్ కమిషనర్ లేకపోవడంతో పాలన గాడి తప్పింది. పట్టణంలో అభివృద్ధి పనులు జరగడం లేదు. కొత్త కమిషనర్ వచ్చి రెండు రోజులు కూడా విధులు నిర్వహించకుండా వెళ్లిపోయారు. ఇన్‌చార్జి కమిషనర్ నామమాత్రంగా వ్యవహరిస్తుండడంతో మున్సిపాలిటీలోని అన్ని విభాగాల్లో అలసత్వం నెలకొంది. అధికారులు, సిబ్బందిలో విధులకు హాజరవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మున్సిపాలిటీని తనిఖీ చేసి అధికారులను హెచ్చరించిన వారి తీరు మారలేదు. మరోవైపు పట్టణంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్ల పరిశీలన

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించే జూనియర్ కళాశాల మైదానాన్ని మంగళవారం ఆర్డీవో కిరణ్మయి, జిల్లా టూరిజంశాఖ అధికారి జనార్దనరెడ్డి స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. పండుగ నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం పులికాట్ సరస్సు, అట్టకానితిప్ప వద్దనున్న పర్యావరణ విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలించారు. సందర్శకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక అధికారులకు సూచించారు. అలాగే దొరవారిసత్రం మండల పరిధిలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని అధికారుల బృందం పర్యటించి ఏర్పాట్లపై చర్చించింది. ఈసీ సెంటర్, చెక్‌లిస్టు ప్రాంతం, చెరువు కట్టపై పక్షుల వీక్షణ ప్రదేశాలను పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం దొరవారిసత్రం నుంచి రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా పక్షుల కేంద్రానికి ఉన్న మార్గమే కాకుండా కలగుంట, నెల్లూరుపల్లి, మైలాంగం మీదుగా నేలపట్టు పక్షుల కేంద్రా నికి ఉన్న మరో రోడ్డు మార్గాన్ని కూడా పక్షుల పండుగ సమయంలో ఉపయోగించుకొనేలా ఏర్పాట్లు చేపట్టేందుకు అధికారులు చర్చించారు. ఈ కార్యక్రమాల్లో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, డీఎఫ్‌వో ఈ.హారిక, నేలపట్టు ఎఫ్ఆర్‌వో సౌజన్య, సూళ్లూరుపేట ఎంపీడీవో ప్రమీలారాణి, తహసీల్దార్ నరసింహరావు, సీఐ మురళీకృష్ణ, దొరవారి సత్రం తహసీల్దార్ శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, నాయుడుపేట రూరల్ సీఐ సంఘమేశ్వరరావు, ఎస్ఐ అజేయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానంలో ఆర్డీవో కిరణ్మయి, టూరిజం శాఖ అధికారి జనార్దనరెడ్డి, డీఎస్పీ చెంచుబాబు, తహసీల్దార్ నరసింహరావు, డీఎఫ్‌వో హారిక తదితరులు





గూడూరు, సూల్లూరుపేటల్లో విద్యుత్ దీపాలంకరణతో మెరిసిపోతున్న చర్చిలు

క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు

గూడూరు, చిల్లకూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి టౌన్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగకు చర్చిలు ముస్తాబయ్యాయి. గూడూరు పట్టణంలోని చర్చిలు, ప్రార్థనా మందిరాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. మంగళవారం రాత్రి పట్టణంలోని వివిధ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ఎస్‌పీఎల్సీ, ప్రార్థనా మందిరం, హోసన్నా మందిరం, యురోషిలేము ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవ సోదరులు ప్రార్థనా గీతాలను ఆలపించి ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు. నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులకు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. చిల్లకూరు మండలంలోని ఏరూరు సెయింట్ జాన్స్ లూథరన్ చర్చి వద్ద 35 అడుగుల భారీ స్టార్‌ను ఏర్పాటు చేశారు. సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండు సమీపంలో లూథరన్ చర్చి, హోలీక్రాస్ కూడలిలో ఉన్న చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించి సుందరబంగా ముస్తాబు చేశారు. క్రైస్తవులు మంగళవారం సాయంత్రం చర్చిల్లో ప్రార్థనలు చేశారు. వెంకటగిరి పట్టణంలోని కాశీపేటలో ఉన్న పరిశుద్ధ పేతులూరు లూథర్ చర్చి, చింతగుంటలో ఉన్న సీయోన్ గాస్పాల్ చర్చి పాస్టర్ డేవిడ్, కోళ్లపారం వద్ద ఉన్న బెరయ ప్రార్థన మందిరంలో మంగళవారం క్రిస్మస్ వేడుకలను పురష్కరించుకుని చర్చిలకు విద్యుత్ కాంతులతో అలంకరించారు. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభిస్తున్నామని చర్చి ఫాదర్‌లు వివరించారు. పట్టణంలోని పేతురు లూథరన్ చర్చి ఆవరణలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలంలోని 66 చర్చిలకు గుణకల లక్ష్మీప్రసన్న చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కేక్‌లు పంపిణీ చేశారు. ముఖ్య అతిధులుగా హాజరైన సీఐ రమణ, రోటరీక్లబ్ నిర్వహకులు కేక్ కట్‌చేసి క్రిస్‌మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుణకల లక్ష్మీ ప్రసన్న చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ధనంజయ, సతీమణి లక్ష్మీప్రసన్న, ట్రెజరర్ జయచంద్ర, ప్రభాకర్, రోటరీ క్లబ్ ప్రెసిండెంట్ బీకే ప్రసాద్, సుధాకర్ నాయుడు, విజయ్, కృష్ణయ్య, రమేష్ తదతరులు పాల్గొన్నారు.



వెంకటగిరిలో కేక్‌లు పంపిణీ చేస్తున్న గుణకల లక్ష్మీప్రసన్న ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు

షార్‌లో సీఐఎస్ఎఫ్ ఏడీజీ తనిఖీలు

సూళ్లూరుపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ డిప్యూటీ జనరల్ పద్మాకర్ మంగళవారం షార్‌లోని సీఐఎస్ఎఫ్ యూనిట్ విభాగాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. షార్ మొదటి, రెండో గేటు, ప్రయోగ వేదికల వద్ద భద్రత గురించి తెలుసుకొన్నారు. ఆయన వెంట సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజిత్ కుమార్ తదితరులు ఉన్నారు.

భూసమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

వాకాడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నట్లు తహసీల్దారు రామయ్య తెలిపారు. మండలంలోని మూలపడవ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై 42 వినతులు వచ్చాయని, వాటిని త్వరితగతిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని తహసీల్దారు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కిషోర్, ఆర్ఐ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా తప్పనిసరి

ఓజిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం తిరుమలవూడి, కుందాం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో విజయలక్ష్మి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. అదేవిధంగా విత్తన ఎంపిక, నారుమళ్ల తయారీ, ఎరు వులు, పురుగు మందుల వాడకం గురించి అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట ఎరువుల ఆవశ్యకతను వివరించారు.

వెంకటగిరి టౌన్ (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జీకే పల్లి, కుమ్మరిపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ నాగర్జున సాగర్, ఏవో సుజాత మాట్లాడుతూ ప్రతి రైతూ పంటల బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్ఎన్ఆర్ 15048 వగడం సాగు, ఎరువుల యాజమాన్యం, చీడ పీడల నివారణ, పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు వేసుకోవాల్సిన టీకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రామ మోహన్, గోపీకృష్ణ, శ్రీప్రియ, లావణ్య, వేణు, రైతులు పాల్గొన్నారు.

గూడూరులో చిరుజల్లులు

గూడూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం ప్రభావం వల్ల పట్టణంలో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడ్డాయి. చలితీవ్రత పెరగడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.

ఓజిలిలో ముసురు

ఓజిలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు చిరుజల్లులు పడ్డాయి. కాగా సాయత్రం 4 గంటలకే చీకట్లు అలుముకున్నాయి. చలిగాలులు కూడా తోడవడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటవచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షాలకు నిమ్మతోటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన పడుతున్నారు.

రైల్వే కాంట్రాక్టరుదే ఇనుప పెట్టె

తడ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాళంగి నదిలో కొట్టుకువచ్చి చేనిగుంట నది ఒడ్డున చేరిన ఇనుపపెట్టె రైల్వే కాంట్రాక్టరుదేనని నిర్ధారణ అయింది. చేనిగుంట కాళంగినది ఒడ్డున ఇనుప పెట్టె కలకలం రేపిన విషయం విదితమే. దీనిపై వార్తలు వెలువడటంతో అది తమదేనంటూ రైల్వే కాంట్రాక్టర్లు ముందుకువచ్చారు. సూళ్లూరుపేట సమీపం కాళంగినదిపై ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద గత కొద్ది రోజులుగా సిమెంట్ గడ్డర్ల మార్పు పని జరుగుతోంది. పది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు కాళంగినది పొంగడంతో రైల్వే బ్రిడ్జికి ఉపయోగించే మూడు ఇనుప పెట్టెలు కొట్టుకుపోయాయి. అందులో ఒకటి సోమవారం బయటపడటంతో రైల్వే కాంట్రాక్టర్ మురళీరెడ్డి అది తమదేనంటూ చెప్పుకొచ్చారు. మిగిలిన రెండు దొరకాల్సి ఉందన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు అర్బన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎంయూపీ పాఠశాలలో మంగళవారం క్రిస్మస పండుగను పురస్కరించుకుని ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో పొనకా మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, సురేష్‌రెడ్డి, శ్రీనివాసులు, కరిముల్లా, మల్లికార్జున్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్ దబ్బల

సూళ్లూరుపేట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, అతని కుటుంబ సభ్యులు మంగళవారం ఇడుపులపాయలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

27న పోరుబాట

వెంకటగిరి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజల నడ్డి విరిచేలా కరెంటు ఛార్జీలను పెంచుతున్నందుకు నిరసనగా ఈనెల 27న వెంకటగిరి పట్టణంలోని సబ్‌స్టేషన్ వద్ద పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తామని వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, బాలయ్య, శ్రీనివాసులురెడ్డి, శంకరయ్య తెలిపారు. మంగళవారం నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి నివాసంలో పోరుబాట కరపత్రాలు ఆవిష్కరించారు. కౌన్సిలర్లు కల్యాణి, వహిదా, సుజాత, ప్రసాద్‌రెడ్డి, దానీబాషా, నారాయణ, రాజారెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లి పాల్గొన్నారు.

ఫైనాన్స్ కంపెనీల దోపిడీని అరికట్టాలి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల్లా వెలిసి జనాన్ని దోపిడీ చేస్తున్న ఫైనాన్స్ కంపెనీల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీవీ రమణయ్య అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సెల్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, ఫర్నీచర్, ఎలక్ట్రానిక్స్ పరికరాలతో పాటు హౌసింగ్ లోన్లు ఇస్తామంటూ ఫైనాన్స్ సంస్థలు బోర్డులు పెట్టుకుని ఏజెంట్ల ద్వారా ప్రజలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. హౌసింగ్ లోన్ల కోసం ప్రభుత్వం ఇచ్చిన స్థలాలను కూడా దళారుల ద్వారా రిజిస్టర్ చేసుకుంటున్నారని, తీరా ఖర్చుల పేరిట పెద్ద మొత్తంలో వసూలు చేసి కొంత నగదు లబ్ధిదారుల చేతుల్లో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి జనాన్ని దోపిడీ చేస్తున్న ఫైనాన్స్ కంపెనీల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి



జడ్పీ చైర్ పర్సన్ అరుణమ్మకు వినతిపత్రం అందజేస్తున్న విజయశ్రీ

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరుస వరదలతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో పంటలు నీటి మునిగిపోయాయని, నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నెల్లూరులో జరిగిన జడ్పీ సమావేశంలో చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా పశువైద్యశాలలో వైద్యులు లేక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని, సిబ్బందిని కేటాయించాలని కోరారు. ఈ మేరకు చైర్ పర్సన్‌కు ఎమ్మెల్యే వినతిపత్రం అందజేశారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దారు చంద్రశేఖర్, పక్కన అర్జీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. మంగళవారం గూడూరు మండలం వెందోడు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు అందజేసే తెలియజేసే సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, సర్వేయర్ విశ్వనాథం, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పాతనాలపాడులో రెవెన్యూ సదస్సు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

డక్కిలి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ స్వగ్రామమైన డక్కిలి మండలం పాతనాలపాడులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాసులుకు స్థానికులు వినతులు అందజేశారు. వైసీపీ పాలనలో తమ గ్రామం అభివృద్ధి గురించి ఎవ్వరూ పట్టించుకోలేదని గ్రామస్థులు అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూముల సర్వే, మ్యుటేషన్ కల్పించాలని అర్జీలు అందజేశారు. వీటన్నింటినీ ఆన్‌లైన్ చేసి సత్వర పరిష్కారం చూపడం జరుగుతుందని తహసీల్దార్ చెప్పారు. కార్యక్రమంలో సర్వేయర్ రాజగోపాల్, ఆర్ఐ ప్రియాంక, ఏఎస్‌వో వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మధుసూదనరెడ్డికి భూమిరత్న పురస్కారం



భూమిరత్న పురస్కారం అందుకొంటున్న మధుసూదనరెడ్డి

సూళ్లూరుపేట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో అధునాతన పనిముట్లు ఉపయోగించి, నూతన వరి వంగడాలను సాగుతో అధిక దిగుబడులు సాధిస్తూ ఆదర్శ రైతుగా పేరొందిన సూళ్లూరుపేట మండలం వెలగల పొన్నూరుకు చెందిన శిసనంబేటి ముధసూదనరెడ్డికి భూమిరత్న పురస్కారం అందుకున్నారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్‌లో ఇన్నోవేటివ్ ఫార్మింగ్ ఫౌండేషన్ రైతు సహాయక వేదిక కార్యక్రమం నిర్వహించింది. అధునాతన డ్రమ్ సీడర్ పరికరాలను స్వయంగా తయారీ చేసి, అతను వినియోగించడమే కాకుండా ఇతర రైతులకు ఇస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నందుకు శిసనంబేటి ముధసూదనరెడ్డికి భూమిరత్న పురస్కారం అందజేశారు.

హైవే రోడ్డు పనుల తనిఖీ



రోడ్డు పరిశీలనలో హైవే శాఖ పీడీ వెంకటేశ్వర్లు తదితరులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం, పెద్ద కన్నలి, చిన్న సింగమాల, పెద్ద సింగమాల, పొయ్య, పొయ్యకొత్తూరు, లింగంనాయుడుపల్లి, చెంబేడు వద్ద హైవేను ఆ శాఖ పీడీ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. సంబంధిత గ్రామాల ప్రజలు సర్వీసు రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని అక్కడక్కడ పంట కాలువలు పూడ్చి వేశారని హైవే పీడీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ... హైవే రోడ్డు పనులు సర్వీసు రోడ్డు, స్కూల్ వద్ద ఆయా గ్రామాలకు ఇబ్బందులు లేకుండా తొందరగా పూర్తి చేయాలని సంబంధిత కంపెనీ సిబ్బందిని ఆదేశించారు. పొయ్య గ్రామ సమీపంలో ఉన్నయ సర్వే నెం. 378 దగ్గర, చెంబేడు కాలువ పక్కన సర్వీసు రోడ్లను ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిర్మించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మధుసూదన్‌రావు, వైసీపీ నాయకులు వాసుదేవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయండి

ఏర్పేడు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నచ్చనేరి పంచాయతీలో జరుగుతున్న మినీ గోకులాల పనులను మంగళవారం డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ పరిశీలించారు. డిసెంబరు 30 లోపు మిగులు పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం జంగాలపల్లిలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంటు రోడ్డుకు ఇరువైపులా మట్టితో షోల్డర్స్ ఏర్పాటు చేయాలన్నారు. పీఆర్ ఏఈ రవితేజ, అదనపు కార్యక్రమాధికారి దేవరి తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడికి దాతల వితరణ

ఏర్పేడు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరాలయంలో నిత్యాన్నదానం నిర్వహణకు తిరుపతికి చెందిన సునీల్‌కుమార్, సృజన దంపతులు ఐదు లీటర్ల హాట్ బాక్సులు, 50 ప్లాస్టిక్ ప్లేట్లను అందించగా, రవి 50 లీటర్ల స్టీల్ వాటర్ డ్రమ్మును వితరణ చేశారు. అదే విధంగా తిరుపతికి చెందిన నాగరాజు ఫ్యాన్‌ను అందజేశారు. వీటిని ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు ఆధ్వర్యంలో ఆలయ అధికారులకు అందించారు. వారికి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయ పాలకమండళ్లలో దేవాంగులకు ప్రాధాన్యం ఇవ్వండి



వరదయ్యపాళెం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆలయ పాలక మండల్లో దేవాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలని దేవాంగ ప్రతినిధులు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోరారు. నెల్లూరు నగరంలోని రంగనాయకులపేటలో ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా మంగళవారం కలిశారు. ఆయనకు చరఖాను అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ గుత్తి త్యాగరాజు మాట్లాడుతూ పలు దేవస్థానాల్లో ఏర్పాటు చేసే పాలకమండల్లో దేవాంగులకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

యువతి ఆత్మహత్య

రేణిగుంట, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో యువతి ఉరి వేసుకుంది. ఈ ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వీఎం వీధికి చెందిన సతీష్‌కుమార్ కుమార్తె అసిత(22) ఇటీవల లండన్‌లో ఎంఎస్ పూర్తి చేసుకుని ఇంటికి వచ్చింది. విదేశాల్లో మరిన్ని ఉన్నత చదువులు చదవాలని తండ్రితో చెప్పింది. ఏమైందో తెలియదు కానీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. కుటుంబీకుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

సీపీఐ శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేద్దాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సీపీఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేద్దామని నియోజకవర్గ కార్యదర్శి జె.గురవయ్య కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 26వ తేదీ గురువారం సీపీఐ శతజయంతి ఉత్సవాలు జరుగుతాయన్నారు. నియోజకవర్గంలోని సీపీఐ కార్యాలయాల్లో పార్టీ జెండా ఆవిష్కరించి ర్యాలీలు, సభలు నిర్వహించాలన్నారు. అదే విధంగా వంద సంవత్సరాల చరిత్రను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తులసీరాజన్, ఆర్‌గోపి, ఎం.శివకుమార్, శ్రీనివాసులు, గురవయ్య, చారుశీల, మురళి, నరసింహారావు, ముని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బీఎస్సీలో ఉత్తీర్ణత సాధించిన సుధీర్‌బాబు, జగదీష్‌కు టీసీఎస్ పరిశ్రమలో గ్రాడ్యుయేట్ ట్రైనీలుగా నియమితులయ్యారు. దీంతో మంగళవారం ఆ విద్యార్థులకు ప్రిన్సిపాల్ నరసింహవర్మ అభినందించారు. ఇందుకు ప్రత్యేక తర్ఫీదు ఇచ్చిన సైన్స్ విభాగాధిపతి సతీష్‌కుమార్‌ను ప్రశంసించారు. అధ్యాపకులు గిరిజ, పరంధామయ్య, రాజేంద్రుడు, గంగారామ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్‌చైర్మన్‌కు ముక్కంటి ప్రసాదాలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్‌గా మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి తాడేపల్లిలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి పార్లమెంట్ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు టి.ప్రకాష్‌నాయుడు హాజరయ్యారు. శ్రీనివాసరెడ్డిని కలంకారీ శాలువాతో సత్కరించి ముక్కంటి తీర్థప్రసాదాలను అందజేశారు.

నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ అధికారులు

రేణిగుంట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులమండ్యంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని మంగళవారం జరిగిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో వినియోగదారులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాజులమండ్యం పరిధిలో పారిశ్రామికవాడ ఉండడంతో లోడు పెరిగి నాణ్యమైన విద్యుత్ సరఫరా కావడం లేదన్నారు. అలాగే చోరీలకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి అమర్చాలని కోరారు. ఏఈలు చంద్రశేఖర్‌రావు, వాసవీలత, డీఈ రమేష్‌బాబు, స్థానిక విద్యుత్ శాఖ అధికారులు హరిప్రసాద్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సత్యవేడు మండలం కొల్లడం (ఎస్సీ), వరదయ్యపాళెం మండలం రామిరెడ్డిపాళెం (ఓసీ), పులివెల్లం (ఎస్సీ) అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో దేవకుమారి తెలిపారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని 21 నుంచి 35 సంవత్సరాల్లోపు వయస్సు కలిగి, టెన్త్ ఉత్తీర్ణత సాధించి స్థానిక వివాహితలు అర్హులని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను జనవరి 6వ తేదీ సాయంత్రం 4.30 గంటల్లోగా సత్యవేడు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని ఆమె తెలిపారు.

యూటీఎఫ్‌లో మండలవాసులకు స్థానం

కేవీబీపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో సోమవారం జిల్లా యూటీఎఫ్ మహాసభలు జరిగాయి. ఇందులో జిల్లా ఎన్నికలు నిర్వహించారు. మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు హేమాంబరధరరావు జిల్లా కార్యదర్శిగా, మునెయ్య జిల్లా కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. వీరి ఎన్నిక పట్ల మండలంలోని ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేశారు.

‘ఉపాధి’లో అవకతవకలు!

పనులు చేయకుండానే బిల్లుల చెల్లింపులు ● పట్టించుకోని అధికారులు





కాట్రపల్లి చెరువులో పనిచేస్తున్న కూలీలు - వర్షంలో కూడా ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కేవీబీపురం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పేదల జీవన ప్రమాణాలను పెంచాలన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకంలో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. చేయని పనులకు బిల్లులు చెల్లించి పేదలకు అన్యాయం చేస్తున్నారు. గత మూడేళ్లలో రూ.13 లక్షలు పక్కదారి పట్టడమే ఇందుకు నిదర్శనం. ఉపాధి హామీ పథకంలో కీలక విధుల్లో ఉన్న వ్యక్తులే దీనికి సూత్రధారులు.

కేవీబీపురం మండలంలో 39 పంచాయతీల్లో దాదాపు 40వేలకు పైగా ఉపాధి కూలీలకు జాబ్ కార్డులు ఇచ్చారు. అయితే జాబ్‌కార్డు తీసుకున్న కొంతమంది గ్రామాల్లో ఉండరు. వారి కార్డులను కొంతమంది సిబ్బంది వినియోగిస్తూ కూలీకి రాకపోయినా... హాజరైనట్లుగా బిల్లులు పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. కేవీబీపురం, బ్రాహ్మణపల్లి, కండ్లూరు, రంగయ్యగుంట, దిగువపుత్తూరు, అంజూరు, బైరాజులకండ్రిగ, కాళంగి, పాతపాళెం గ్రామాల్లో ఈ తంతు ఎక్కువగా సాగుతూ వచ్చింది. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్ కీలక పాత్ర పోషించినట్టు ఆరోపణలున్నాయి. ఆ ఉద్యోగికి రాజకీయ పలుకుబడి ఉన్నట్టు సమాచారం. దీనికి తోడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తప్పుడు లెక్కలతో కూలీల డబ్బు పక్కదారి పడుతోంది. రంగయ్యగుంటలో ఒక వ్యక్తి వేరే ప్రాంతంలో ఉద్యోగం చేసుకుంటున్నా అతని పేరుపై జాబ్‌కార్డు సృష్టించి పనులు చేస్తున్నట్లు బిల్లులు వస్తున్నాయి. గతంలో సీపీఎం నాయకుడు ఉపాధి పనుల్లో అవినీతి జరుగుతోందని గళమెత్తినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రస్తుతం జరుగుతున్న ఆడిట్‌ను పక్కాగా నిర్వహిస్తే అవినీతికి పాల్పడిన వారందరూ బయటకు వస్తారు. ఆ దిశగా అధికారులుచర్యలు తీసుకోవాల్సి ఉంది.

క్రిస్మస్ వేడుకలకు సిద్ధమైన చర్చిలు







శ్రీకాళహస్తి పట్టణంలో విద్యుత్‌కాంతులతో వెలిగిపోతున్న లూథరన్ చర్చి, సెయింట్ జేవియర్స్ చర్చి - రేణిగుంటలో ప్రార్థనలకు సిద్ధమైన లూథరన్ చర్చి

శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం జరగనున్న క్రిస్మస్ వేడుకలకు చర్చిలు సిద్ధమయ్యాయి. పట్టణ శివార్లలోని లూథరన్‌చర్చి, పట్టణంలోని సెయింట్ జేవియర్స్ చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. చర్చిలలో క్రీస్తు జననం వంటి దృశ్యాలను ఏర్పాటు చేశారు. ఇది ఎంతగానో ఆకట్టుకుంది.

రేణిగుంట: మండలంలోని చర్చిలు కిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో చర్చిలను సుందరంగా అలంకరించారు. జెరూసలేం, అపోస్టలిక్, సెయింట్ జాన్స్, లూథరన్, ఆర్‌సీఎం, జీవగ్రామం లూథరన్ చర్చిలను సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీప కాంతులతో చర్చిలు వెలిగిపోతున్నాయి.

కేవీబీపురం: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని మండలంలోని క్రైస్తవుల ప్రార్థనా మందిరాలు ప్రత్యేకంగా విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. రాయపేడు పాస్టర్ బాబు, జాన్ బసవయ్య ఆధ్వర్యంలో మంగళవారం కేవీబీపురం, సదాశివపురం, రాయపేడు, కళత్తూరుల్లో శాంటాక్లాజ్ వేషధారణలతో ఊరేగింపుగా వేడుకలు జరుపుకున్నారు.



కేవీబీపురం పట్టణంలో శాంటాక్లాజ్ సందడి

క్రిస్మస్ శుభాకాంక్షలు - ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): కరుణామయుడు, లోక రక్షకుడు ఏసుప్రభువు జన్మించిన పర్వదినం క్రిస్మస్ వేడుకలను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. శాంతి, దయ, ప్రేమ, ధర్మం, న్యాయం, అహింస, పరోపకారం వంటి ఏసుక్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమన్నారు. క్రీస్తు చూపిన సన్మార్గంలో ప్రతి ఒకరూ పయనిస్తూ ఉన్నతమైన జీవితాన్ని గడపాలన్నారు. రాష్ట్రాన్ని సుపరిపాలన వైపు నడిపిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, రాష్ట్రప్రభుత్వంపై ఏసుప్రభువు కరుణాకటాక్షాలు మెండుగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

సొంతింట్లో అనుభూతి హాస్టళ్లలో ఉండాలి: ఆదిమూలం





పిచ్చాటూరు, నాగలాపురం సంక్షేమ హాస్టళ్లలో స్లాబ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు సొంత ఇంట్లో ఉన్న అనుభూతి ఉండాలన్నదే తన తపన అని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. పిచ్చాటూరు బాలుర వసతి గృహం, వెంగళత్తూరు బాలుర వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కూడా హాస్టర్‌లో ఉండి చదుకున్నానని, ఆ కష్టాలు తనకు తెలుసన్నారు. నియోజకవర్గంలోని 12 ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల మరమ్మతుల కోసం రూ.1.03 కోట్లు విడుదల లైందన్నారు. రూ.10.65 లక్షలతో పిచ్చాటూరు హాస్టల్‌ను, రూ.7.44 లక్షలతో వెంగళత్తూరు హాస్టల్‌కు మరమ్మతులను త్వరితగతి పూర్తి చేయాలని డీడీ చెన్నయ్యను కోరారు. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి శ్రీకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, అరణియార్ ఆయకట్టు చైర్మన్ రవిరెడ్డి, నాయకులు శ్రీనివాసులు, శరవణ పాల్గొన్నారు.

నాగలాపురం: పట్టణంలోని సంక్షేమ హాస్టల్‌ను ఎమ్మెల్యే ఆదిమూలం తనిఖీ చేశారు. గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎస్సీ బాలుర హాస్టల్ మరమ్మతులకు రూ.8.10లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పను లు ప్రారంభిస్తామన్నారు. అనంతరం అక్కడి నుంచి అనారోగ్యంతో మృతిచెందిన నాగలాపురం టీఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పరశురాం శిల్పి తండ్రి శ్రీనివాసన్ భౌతికకాయానికి నివాళులర్పించారు. శ్రీనివాసయాదవ్, మురళీ, సురేష్, మాతయ్య, రాజశేఖర్ యాదవ్, అన్బు, శేషాద్రి పాల్గొన్నారు.

బీఎన్‌కండ్రిగలోముసురు వాన



బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ముసురుతో కూడిన వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రెండు నెలలుగా వరుస తుఫాన్లతో ఇబ్బంది పడుతున్న ప్రజలు వానకు తోడు చలిగాలులు వీచడంతో ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షం అధికమైతే వేసిన వరి పంటలు దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువులు కూడా నిండుకుండల్లా ఉన్నాయి.

ఎడ్ల బండి బోల్తా: ఎద్దు మృతి

శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నదిలో ఇసుక కోసం ఎడ్లబండి నీటిలో దిగి ప్రవాహానికి కొట్టుకుపోగా ఎద్దు మృతి చెందింది. ఏఎంపుత్తూరుకు చెందిన చంద్రయ్య మంగళవారం తన కుమారుడు మునిబాలాజీతో కలిసి ఇసుక కోసం బూరగమానుకండ్రిగ వద్ద ఎడ్లబండితో నదిలోకి దిగారు. ఇసుక మేట వద్దకు చేరుకునే క్రమంలో ప్రవాహానికి ఎడ్ల బండి కొట్టుకుపోయింది. దీంతో ఎద్దు మరణించింది. తండ్రీ కొడుకులకు ఈత రావడంతో ప్రాణాలతో ఒడ్డుకు చేరుకున్నారు. స్థానికుల సాయంతో ఎడ్ల బండిని ఒడ్డుకు చేర్చారు. కొట్టుకుపోయిన ఎద్దు నది మధ్యలో ముళ్లపొదలో చిక్కుకోవడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో ఒడ్డుకు చేర్చారు. తమకు జీవనాధారమైన ఎద్దును కోల్పోవడంతో చంద్రయ్య విలపించాడు.

విత్తనాలందించి ఆదుకుంటాం

పిచ్చాటూరు, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో రాస్ కేవీకే దత్తత తీసుకున్న ముడియూరు, అప్పంబట్టు, కారూరు గ్రామాల రైతులకు ఈనెల 30 తేదీ వేరుశనగ, సూర్యకాంతి, నువ్వులు, మినుములు పంపిణీ చేస్తామని శాస్త్రవేత్త డి.ఎల్. శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం టీకేపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వరి, వేరుశనగలో సస్యరక్షణ చర్యలను వివరించారు. రైతులకు త్వరలో ఫార్మర్ ఐడీ అందుతుందన్నారు. ఈ ఐడీ ఉన్న వారికి మాత్రమే ఎరువులు, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ లాంటి ప్రభుత్వ పథకాలు రాయితీలు అందుతాయన్నారు. ఈ నెల 31 లోపు ప్రతి రైతు కామన్ సర్వీస్ సెంటర్‌లో వరి, వేరుశనగకు బీమా ప్రీమియం చెల్లించుకోవాలన్నారు. కార్యక్రమంలో దివ్య అగ్రికల్చర్ ఏడీ సుబ్రహ్మణ్యం, ఏవో సంజీవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

లాడ్జీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

రేణిగుంట, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : లాడ్జీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని లాడ్జీల యాజమానులతో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీవారి దర్శనార్థం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారని, వారికి గదులు అద్దెకు ఇచ్చేటప్పుడు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకోవడంతోపాటు పూర్తిస్థాయి చిరునామా నమోదు చేయాలని చెప్పారు. కాగా ఉదయం హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ శరత్‌చంద్ర, ఎస్ఐ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు రైతులకు వరం

శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసం వేచిచూసే రైతులకు రెవెన్యూ సదస్సులు వరమని తహసీల్దారు లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ఎంపేడులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సుమారు 40 మంది భూసమస్యల పరిష్కారం కోసం విజ్ఞప్తి చేశారు. గ్రామానికి చెందిన ఓ వైసీపీ నాయకుడుల ఆస్తిపంపకాల విషయంలో అన్యాయం చేస్తున్నాడంటూ ఫిర్యాదు చేశారు. భాగపరిష్కారంపై రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు వారికి తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు తాటిపర్తి ఈశ్వరరెడ్డి, తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మనోన్మణి ఉత్సవం



శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం మనోన్మణి (గొబ్బెమ్మ) ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మొదట ఆలయ అలంకార మండపంలో గొబ్బెమ్మకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారిని చప్పరంపై అధిష్ఠింపజేసి వీధుల్లో ఊరేగించారు. అమ్మవారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

విస్తరణ శిక్షణ కేంద్రం ఇన్‌స్ట్రక్టర్‌గా వసుంధర

శ్రీకాళహస్తి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని విస్తరణ శిక్షణ కేంద్రం ఇన్‌స్ట్రక్టర్‌గా వసుంధరను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాళహస్తి విస్తరణ శిక్షణ కేంద్రంలో గతంలో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసిన విద్యారమ నెల్లూరు జడ్పీ సీఈవోగా గత నెల 18న పదోన్నతిపై బదిలీ అయ్యారు. దీంతో ఈటీసీలో ఇన్‌స్ట్రక్టర్ స్థానం ఖాళీ అయ్యింది. ఈ మేరకు ప్రకాశం జిల్లా డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్న వసుంధరను ఈటీసీ ఇన్‌స్ట్రక్టర్‌గా బదిలీ చేశారు.

లక్ష్మీనరసింహుడి సేవలో పెద్దిరెడ్డి



నారాయణవనం, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగిరికోనలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామిని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు స్వామివారి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

రేషన్ బియ్యం స్వాధీనం



సత్యవేడు, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్ట్ చేశారు. శ్రీసిటీ సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పెద్ద ఈటిపాకం సమీపంలో మంగళవారం తెల్లవారు జామున ఎస్ఐ హరిప్రసాద్ సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. అటుగా వచ్చిన మినీవ్యాన్‌ను ఆపి రికార్డులు పరిశీలించారు. ఇందులో 77 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ క్రమంలో వ్యాన్‌లో ఉన్న ఒకరిని అదుపులో తీసుకోగా, డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు పరారయ్యారరు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.